

# మౌన ప్రభ



ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి : 7 సంచిక 3 జులై, 2008 పేజీలు : 20 వెల రూ. 10/-



## గురుపూర్ణిమ ప్రత్యేక సంచిక

# గురుమతము

శ్రీ సిద్ధేశ్వరానందభారతీమహాస్వామి

వేదంలో మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథిదేవోభవ అని చెప్పబడింది. అక్కడ మాతృదేవాది శబ్దములు బహువ్రీహి సమాసములు. నీవు మాతృదేవుడవు కమ్ము, అనగా తల్లిని దేవునిగా చూచువాడవు కావలసినది. మిగిలిన శబ్దాలు కూడా ఇదే పద్ధతిలో అన్వయించాలి. తల్లిదండ్రులు నిజమైన దేవతలుకావచ్చు, కాకపోవచ్చు కానీ వారిని దేవుళ్ళుగా భావించి ఆరాధించిన కుమారుడు తరిస్తాడు. ఏ వ్యక్తిలోనైనా దేవుని చూడగల్గిన తీవ్రభావన ఉంటే ఆ భావము వల్ల, ఆ విశ్వాసము వల్ల ఆ వ్యక్తి దివ్యానుగ్రహాన్ని పొందుతాడు. ప్రాచీన గాథలలో పతివ్రతల కథలన్నీ అటువంటివే. భర్త దుష్టుడైనా, దుర్నీతిపరుడైనా, రోగి అయినా అతనిని దేవునిగా భావించి, సేవించిన పతివ్రతలు సూర్యునే శాసించ గలిగారు, దిక్పాలకులనే నియంత్రించగలిగారు, భావతీవ్రత, నిష్ఠ ఎక్కడైతే ఉంటుందో అక్కడల్లా శక్తి ఉదయిస్తుంది. ఈ సాధకులందరికీ తమ తల్లులు, తండ్రులు, భర్తలు, అతిథులు, గురువులు, దేవతలు కారని తెలుసు. కాని వారి యందు ఏర్పడిన భక్తి వల్ల, శ్రద్ధ వలన దేవత్వ భావన చేస్తుంటారు. గురుశిష్య సంప్రదాయంలో ఈ భావనే పరాకాష్ఠ నందుకుంటుంది.

సుప్రసిద్ధమైన గురుస్తోత్ర శ్లోకాన్ని గమనించండి.

**గురర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరం బ్రహ్మా తస్మై శ్రీ గురవేనమః॥**

గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు, గురువే సాక్షాత్తు పరబ్రహ్మ. అటువంటి గురువునకు నమస్కరిస్తున్నాను అని ఈ శ్లోకభావన. త్రిమూర్తులను తదతీతమైన పరబ్రహ్మమును గురువులో దర్శించాలని తాత్పర్యము. అటువంటిదే మరో శ్లోకము.

**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీగురవేనమః॥**


అజ్ఞానమనే చీకటి చేత గ్రుడ్డియైన వారికిజ్ఞానమనే అంజనాన్ని పూసి, కన్నులు తెరిపించిన గురువునకు నమస్కారము అని దీని భావము. గురువు అజ్ఞానాన్ని తొలగిస్తాడని, వెలుగును ప్రసాదిస్తాడని ఆ శబ్దానికే అర్థం చెప్పబడింది.

**గుకారశ్చాంధకారస్తు రుకారస్తన్నిరోధకృత్**

"గు" అంటే చీకటి, "రు" అంటే దానిని అడ్డగించు వాడు ఈ విధంగా గురుస్థానానికి అత్యంతమైన ఔన్నత్యం భావించబడింది. ఏ రంగంలోనైనా ఆ రంగంలో ప్రవీణుడైన వ్యక్తి యొక్క సహాయం లేకుండా ఏ వ్యక్తీ ముందుకు పోలేదు. హలం పట్టుకున్నా, కలం పట్టుకున్నా నేర్పినప్పుడే అందులోని మెళుకువలు తెలుస్తాయి. లౌకిక అలౌకిక మార్గాలలో దేనిలోనైనా గురువు అవసరమే. ఆధ్యాత్మికరంగంలో కొంతమంది దేవునకు, భక్తునకు మధ్య మధ్యవర్తులు దేనికి? సరాసరి దేవతారాధనే శ్రేష్ఠము అని వాదించే వారున్నారు. అది ఎక్కడో ఒకరిద్దరు కారణజన్ముల విషయంలో సరిపోవచ్చునేమోగాని మామూలుగా అందరికీ హృదయంలో జ్ఞానదీపం వెలిగించే ఆచార్యుడు లేకపోతే సరియైన త్రోవ దొరకదు. మంత్ర, ధ్యాన, జ్ఞాన రంగాలలో గురువు యొక్క మహత్వం అడుగడుగునా గోచరిస్తుంది. సిద్ధుడైన గురువు దొరికితే అంతకంటే అదృష్టం మరొకటి లేదు. అయితే వారిని సాధకులు కనుక్కోవడం కష్టము. సాధకులలోని తపనను గుర్తించి సిద్ధులు, యోగీశ్వరులు వారే శిష్యుల దగ్గరకు రావడం, అదేవిధంగా భాగవత కథలలో చాలా చోట్ల నారదుడు వచ్చి ధ్రువుడు మొదలుగా వారికి ఉపదేశించడం గమనించవచ్చు. యోగ్యతను, అవసరాన్ని గుర్తించి మహాత్ములు దిగివస్తుంటారు. సుప్రసిద్ధుడైన యోగిరాజు శ్యామాచరణ లాహిరి విషయంలో జరిగిన సంఘటన ఈనాడు విశ్వ విశ్రుతమైనది. అతడు రైల్వేశాఖలో చిన్నఉద్యోగి. ఒకరోజు ఉన్నట్లుండి హిమాలయ పర్వత ప్రాంతాలలోని ఒక చిన్న ప్రదేశానికి బదిలీ ఉత్తర్వు వచ్చింది. తీరా అక్కడకు వెళ్ళిన తరువాత అక్కడ రైల్వేశాఖ అధికారులు -"ఇక్కడ పని ఏమీ లేదు మిమ్మల్ని ఎందుకు పంపించారో తెలియదు" అన్నారు. ఆ రోజు సాయంకాలం కొండమీదికి వాహ్యాళికి వెళ్ళిన లాహిరి మహాశయునకు ఒక యోగి కనిపించాడు. కొంచెం దూరంలో ఉన్న ఒక గుహ దగ్గరకు తీసుకొని వెళ్ళి అక్కడ ఉన్న దండకమండలువులను, జపమాలికలను చూపించి- "నాయనా! ఇవి ఏమైనా నీకు తెలుస్తున్నవా? వీటిని గుర్తు పట్టగలవా? "అని అడిగాడు. లాహిరి గుర్తు పట్టలేక పోయినాడు. నాకేమీ తెలియటం లేదు అన్నాడు. అప్పుడు ఆయోగి, నీవు పూర్వ జన్మలో ఇక్కడ తపస్సు చేశావు. ఈ వస్తువులన్నీ నీవు ఉపయోగించినవే అని చెప్పి అతనికి కావలసిన ఉపదేశం చేసి జ్ఞాన నేత్రం వికసించేలా చేశాడు. ఆయనే మహా అవతార్ బాబా అనీ వేల సంవత్సరాలు జీవించిన మహాయోగి యని పరమహంస యోగానంద "ఒక యోగి ఆత్మకథ" లో వివరించారు. గురువు శిష్యులను ఆ రకంగా ఉద్ధరిస్తుంటారు.

దక్షిణదేశంలో వైష్ణవ ధర్మ ప్రవర్తకుడైన రామానుజా చార్యులవారు ఒక రోజు శిష్యులతో శ్రీరంగం పురవీధులలో

కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతి
పరమహంస, పరివ్రాజకాచార్య, జగద్గురు
శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామివారి శుభాశీస్సులతో



# మౌనప్రభ

ఆధ్యాత్మిక, సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక




సంపుటి : 7
సంచిక : 3

జులై
2008

జీవిత చందా రు. 1500/-
సంవత్సర చందా రు. 120/-


మౌనప్రభా మహాయోగి మౌనస్వామి మహత్ప్రభా
జీయాత్ శివచిదానంద మనఃప్రేరణ సంభవా


**ప్రచురణ**
శ్రీ సిద్ధేశ్వరీ పీఠము
మౌనస్వామి మఠము
కుర్తాళము - 627 802
తెన్‌కాశి తాలూకా,
తిరునల్వేలి జిల్లా, తమిళనాడు.
ఫోన్ : 04633 - 283 707

సంపాదకులు
డా॥ ప్రేమ కుమార్ భార్గవ, M.A, Phd.

**ప్రింటర్ & పబ్లిషర్**
కె. శ్యామసుందర్, M.B.A
B1- C40, Ravindra Nagar,
Guntur - 522 006.

**ప్రచురణ స్థలం**
శ్రీ విజయలక్ష్మి ప్రింటర్స్ తరపున
శ్రీ లక్ష్మీగణపతి ఆర్ట్స్ ప్రింటర్స్
2/4, బ్రాడీపేట,
గుంటూరు - 522 002.


## ఇది వరుస............


గురుమతము - శ్రీ సిద్ధేశ్వరానందభారతీమహాస్వామి .......... 1
కృష్ణంవందేజగద్గురుమ్ - శ్రీ మల్లాది పున్నయ్యశాస్త్రి .................... 5
గురుదేవులు
శ్రీసిద్ధేశ్వరానందభారతీస్వామి - డాక్టర్ ప్రేమకుమార్‌భార్గవ .................... 7
జగద్గురువు విద్యారణ్యుడు - శ్రీ పాములపర్తి సదాశివరావు .................. 10
వ్యాసమహర్షి - శ్రీమతి కుసుమా కె.మూర్తి .................... 12
గురుపూర్ణిమ - డాక్టర్ రామడుగు వెంకటేశ్వరశర్మ .......... 12
శ్రీ దక్షిణామూర్తిస్తోత్రం - ఆచార్య శ్రీ అప్పల సోమేశ్వరశర్మ .......... 13
గురుపూజ - గురులక్షణాలు - డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి .................... 14
వ్యాసపూర్ణిమ - శ్రీ ఆంధ్ర శేషగిరిరావు .......................... 15
స్వామీజీ అమెరికాపర్యటన - శ్రీ పి.నాగేంద్రరాయ్ .............................. 16
వేదవ్యాసుని జీవిత సందేశం - డాక్టర్ మోపిదేవి కృష్ణస్వామి .................... 17
ఆచార్యదేవోభవ - శ్రీ జీడికంటి శ్రీనివాసమూర్తి .................. 18
విశాఖ లలితాపీఠంలో
ఆరాధనోత్సవాలు -శ్రీ టి.పి.విజయాచారి .......................... 19


**మౌనప్రభ చందాదారులకు విజ్ఞప్తి**

మౌనప్రభ మాసపత్రిక చందా వెంటనే రెన్యువల్ చేయప్రార్థన - చందా ఈనెలాఖరులోగా రెన్యూ చేయనివారికి జులై నెల మాసపత్రిక నుండి పంపటం సాధ్యపడదని తెలియచేస్తున్నాం. మేనేజింగ్ ఎడిటర్

వెళ్తున్నారు. ఆయన కంటి కొక విచిత్రమైన దృశ్యం కన్పించింది. "ధనుర్దాసు" అనే యువకుడు తన భార్యకు గొడుగు పట్టి ఆమెకు ఎంత మాత్రము ఎండసోకకుండా ఒక సేవకుని వలె ప్రక్కన నడుస్తున్నాడు. దానిని చూచిన ఆచార్యులవారు శిష్యుల చేత అతనిని పిలిపించి- ''ఏమయ్యా! నడివీధిలో ఇలా ప్రవర్తిస్తున్నావు? ఎందుకిలా చేస్తున్నావు? "అని అడిగారు. అతడు -స్వామీ నా భార్యకన్నులు చాలా అందంగా ఉంటాయి. ఎండ వేడి సోకితే వాటి అందం తగ్గిపోతుంది. దానిని నేను భరించలేను. ఎవరేమనుకున్నా నాకేమీ లెక్కలేదు. అందుకే ఆమెకు గొడుగు పట్టి ఆమె వెంట నడుస్తున్నాను" అన్నాడు. ఆచార్య స్వామి- "నీ భార్య కన్నుల కంటే అందమైన కన్నులను చూపిస్తాను. వాటికి కూడా యీలానే సేవచేస్తావా?" అని ప్రశ్నించారు. అతడు నా భార్య కన్నుల కంటే అందమైన కన్నులు ప్రపంచంలో లేవు. మీరు గనుక అన్న ప్రకారం చూపిస్తే దాసాను దాసుడనై సేవిస్తాను" అన్నాడు. రామానుజులవారు అతనిని వెంటబెట్టుకొని గుడికి వెళ్ళి-"అవిగో అటుచూడు స్వామి దివ్య నేత్రాలను వీక్షించు" అన్నారు. ఆ మహనీయుని ప్రభావం వల్ల ధనుర్దాసుకు రంగనాథుని దివ్యనేత్రాల దర్శనం కల్గింది. దానితో అతని జీవితమే మారిపోయింది. అతని మీద అంత అవ్యాజమైన అనుగ్రహాన్ని ఆచార్యులవారు ఎందుకు చూపించారో? వాని పూర్వజన్మ సంస్కారమేమిటో? ఆ సద్గురువులకే తెలియాలి. గురువు లనుగ్రహిస్తే శిష్యులు చదవకుండానే చదువు వస్తుంది. తపస్సు చేయకుండానే దేవతానుగ్రహం వస్తుంది. అయితే ఇది ఆ గురువు సిద్ధపురుషుడైనప్పుడు మాత్రమే సాధ్యము.జగద్గురు శంకరాచార్యులు శిష్యులలో ఒకనికి ఎంత చెప్పినా సరిగా విద్య వచ్చేది కాదట. కానీ వాని గురుభక్తి అచంచలము. గురువు గారికి కావలసిన పనులన్నీ వాడు శ్రద్ధతో చేసేవాడు. మిగతా శిష్యులు వానికి చదువురాదని అవహేళన చేసేవారు. వారికి తగిన పాఠం చెప్పాలని ఒకనాడు భాష్యప్రవచనం మొదలు పెట్టిన శంకరులవారు దూరాన ఉన్న ఆ చదువురాని శిష్యుని రమ్మని పిలిచారు. జగద్గురువుల సంకల్పం వల్ల వాని కప్పటి కప్పుడు విద్యాప్రాప్తి కలిగి కవియై తోటక వృత్తాలలో గురువుగారిని స్తుతిస్తూ వచ్చాడు. మిగిలిన శిష్యులకు దిగ్భ్రాంతి కల్గింది. అతడే తరువాతి కాలంలో తోటకాచార్యులన్న పేరుతో ప్రసిద్ధి చెందాడు.

జగత్ ప్రసిద్ధుడైన వివేకానంద స్వామి రామకృష్ణపరమ హంస వలన ఎంపిక చేయబడి తీర్చి దిద్దబడినవాడే. భగవదన్వేషణలో ఆ యువకుడైన నరేంద్రునకున్న ఆసక్తిని గమనించిన పరమహంస అతినిలో జ్ఞాన జ్యోతిని వెలిగించి మహాపురుషుడయ్యేలా తన తపః శ్శక్తిని ధారపోశాడు. మహితాత్ములైన గురువులు శిష్యులను అనుగ్రహించిన ఇటువంటి కథలెన్నో మన వాఙ్మయంలో గోచరిస్తవి. కొన్ని సంప్రదాయాలలో గురువును దేవునిగా భావించడం మాత్రమే కాక తన మంత్ర దేవతను, గురువునూ ఒకటిగా భావించడం ఉన్నది. ఉదాహరణకు త్రిపురసుందరి సాధనలో పాదుకాంతదీక్ష ఇదే. లలితాదేవిని, గురువును ఏకంగా భావించడం ప్రధాన సూత్రము.

శాస్త్ర విజ్ఞాన వేత్తలైన గురువులు తమ ప్రబోధంతో తమ పాండిత్య ప్రాభవంతో శిష్యుల సందేహాలు తీరుస్తారు. దివ్యశక్తి సంపన్నులైన గురువులు శిష్యులకు మహిమాత్మకమైన అనుభూతులను ప్రసాదించి వారి సంశయాలను తొలగిస్తారు. కొందరు కేవలం తమ చూపు చేతనే శిష్యుల సందేహాలను తీరుస్తారు. వటవృక్ష మూలము నందు ఆసీనుడైన దక్షిణామూర్తి మౌనంతోనే శిష్యుల సందేహాలు పోగొట్టేవాడట.

శ్లో॥ చిత్రం వటతరోర్మూలే వృద్ధ శిష్యా గురుర్యువా
గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యాస్తు ఛిన్న సంశయాః

వృద్ధులైన మహర్షులు యువకుడైన దక్షిణామూర్తి ముందు కూర్చుంటే వారి మనసులో కలిగిన సందేహాలు వాటంతటవే తొలగిపోయేవిట. ఇటువంటి సంఘటన ఒకటి రమణమహర్షి జీవితంలో చూడవచ్చు. ఉత్తర హిందూస్థానం నుండి ఒక గొప్ప పీఠాధిపతి అరుణాచలం వచ్చాడు. పెద్దవాడు వచ్చాడు కదాయని మహర్షి కూర్చునే ఉన్నతాసనం ఎదురుగా ఆయనకో సింహాసనం వేశారు. ఆయన వచ్చి కూర్చున్నారు. భక్తులంతా వారిద్దరూ ఏం మాట్లాడుకుంటారో విందామని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దాదాపు గంట గడచినా ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అప్పుడా పీఠాధిపతి రమణుల వైపు చూచి-"భగవన్!నాకు అవగతమైంది. నా మనస్సులోని సందేహాలు తీరినవి. అన్నాడు. ఈయన అడిగిందిలేదు ఆయన చెప్పింది లేదు. పీఠాధిపతి మనస్సులోని సందేహాలు మహర్షి దృక్ ప్రసారం వల్ల తీరిపోయిన వన్నమాట. కావలసిన సమాధానాలేవో ఆయన మనస్సులో రమణ ప్రసాదంగా అనుభూతి కల్గింది. అటువంటి సద్గురువు మౌనంతోనే శక్తి ప్రసారం చేస్తాడు. ఈ క్రింది శ్లోకం ఆ సద్గురువు ఎలా ఉంటాడో చెబుతుంది.

శ్లో॥ బ్రహ్మానంద పరమ సుఖదం కేవల జ్ఞాన మూర్తిం
ద్వంద్వా తీతం గగన సదృశం తత్త్వ మస్యాది లక్ష్యం
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం

భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి

ఈ విధంగా గురువునే దేవునిగా ఉపాసించే వ్యక్తులు గురువు యొక్క విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని పూజిస్తూ, ఆరాధిస్తూ ఉంటారు. ఏ దేవాలయానికి వెళ్ళినా ఆ దేవతలు ఎవరైనా గురువులకే నీరాజనం ఇస్తున్నట్లుగా భావించే గురుదత్త సంప్రదాయపు హారతి పాటనొక దానిని చూడండి.

**జయ జయ గురుదేవా! స్వామీ జయ జయ గురుదేవా!**
**బ్రహ్మ విష్ణు పరమేశ్వర రూపా! ఆనంద నిలయా!**
**ఓం జయ జయ గురుదేవా!**
**లోపల నీవే! వెలుపల నీవే! అంతయు నీవేలే!**
**జగమంతయు నీవేలే**
**అండ పిండ బ్రహ్మాండములోన ఉన్నది నీవేలే**
**నిండి ఉన్నది నీవేలే!**
**వేదమునీవే! నాదము నీవే! జ్ఞానము నీవేలే**
**బ్రహ్మ జ్ఞానము నీవేలే**
**అందరిలోన వెలుగుచు నున్న ఆత్మవు నీవేలే!**
**పరమాత్మవు నీవేలే**

గురుభక్తి కల్గిన మహాత్ములు ఎక్కడ ఉంటారో అక్కడ పరమేశ్వరుడు ప్రకాశిస్తూ ఉంటాడు.

**శ్లో॥భక్తిర్యస్య నిజేగురౌ హరిహర బ్రహ్మాత్మ బుధ్యాస్థిరా!**
**యోవాచా, మనసా నిశం, సువచసా సంసేవతే సోஉ చిరాత్**
**ఈశానుగ్రహపాత్రమేవ భవతి క్షిప్రం యథాదీపకః**
**శ్రీశస్త ధ్రుధ వర్తితాం చరతి య స్స్వీ యేష్టదాదీపకః**

హరిహర బ్రహ్మలను స్థిరబుద్ధితో ఎవరు గురువునందు దర్శిస్తారో, మనోవాక్కాయ కర్మలతో మంచి పలుకులతో గురువుని ఎవరు భక్తితో సేవిస్తారో, వారికి తప్పక ఈశ్వరానుగ్రహప్రాప్తి సిద్ధిస్తుంది. అట్టివారికి విష్ణువు అధీనుడై ఉంటాడు. దత్తపురాణంలో దీపకుడనే శిష్యుడు గురుభక్తివల్ల ఎంతటి దేవతానుగ్రహాన్ని పొందాడో! ఎవరైనా అలా పొందవచ్చు.

భగవద్గీత ఉన్న ఒక శ్లోకాన్ని చూడండి.

**శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా**
**ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్వదర్శినః**

ఒక భక్తుడు సాయిబాబా పాదసంవాహనం చేస్తూ ఈశ్లోకం చదువుతూ ఉంటే "బాబా" దాని అర్థం అడిగాడు భక్తుడైన "నానా" తనకు తెలిసిన అర్థం చెప్పాడు. అది బాబాకు తృప్తి కలుగులేదు. నానా కోరిక మీద సాయిబాబా దానిని విశదీకరిస్తూ ఇలా చెప్పాడు-"దైవ సాక్షాత్కారం పొందటానికి గురువు యొక్క సేవ శిష్యుడు ఎలా చేయాలో ఈ శ్లోకం చెబుతున్నది. శిష్యుడు తన సమస్తమూ గురువుకు అర్పించాలి. గురువును ఇరుకున పెట్టాలని ప్రశ్నలు వేయరాదు. నీ దేహాన్ని గురువు కర్పించావు కాబట్టి శరీరం నీది కాదన్న అనుభూతి కల్గాలి. ఇవన్నీ గురువుగారి అనే కలికం కంట్లో పెట్టుకో, మాయతెర తొలగిపోతుంది. "ఈవిధంగా పల్కుతూ బాబా తాను ఎన్నో సంవత్సరాలు ఏప్రశ్నావెయ్యకుండా, ఏ కోరికా కోకుండా గురువుని సేవించానని చెప్పాడు. "రాధాబాబా" అనే వృద్ధురాలితో ఆమె మంత్రోపదేశం కోరినప్పుడు ఈ విధంగా తత్వోపదేశం చేశారు-" అమ్మా! నేను నా గురువుగారిని ఎంతో కాలం సేవించాను. ఆయన నాకు ఏ మంత్రమూ ఉపదేశించలేదు. నేను అందుకోని దానిని నీకెలా అందించేది? తల్లీ! మోక్షమొక్కటే జన్మకు పరమార్థము. ఆత్మజ్ఞానం వల్ల అది లభిస్తుంది. అది మంత్ర తంత్రాల వల్ల లభ్యమయ్యేది కాదు. నీ మాటను, మనస్సును, చూపును, ఈ ఇష్టములు, చేష్టలు అన్నింటినీ నీ గురువునందు లగ్నం చేయి. సాధకుడు తాబేలు వంటివాడు. తల్లి తాబేలు, పిల్ల తాబేళ్ళకు పాలు ఇవ్వదు. ఏ ఆహారము ఇవ్వదు. తన చూపులను ఒడ్డునున్న పిల్లల మీదికి ప్రసరింప చేస్తుంది. ఒడ్డున ఉన్న పిల్లలు వాటికవే చక్కగా పెరుగుతూ ఉంటాయి. అలానే నా గురువు నా మీద ఆయన దృష్టి నిలిపారు. నేను నా మనస్సు ఆయన యందు నిలిపాను. ఇంక వేరే మాయలు, మంత్రాలు ఏమీ లేవు. నీవూ అలా చేయి.

మహాపురుషులందరూ ఈ విధంగానే చెప్పారు. గురువు యొక్క అనుగ్రహం ఎలా పనిచేస్తుంది అన్న అంశాన్ని రమణమహర్షి ఎలా చెప్పారో చూడండి-వివిధ సందర్భాలలో భక్తులడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ ఆయన పల్కిన వాక్యాలను సమీకరణ చేసి కొన్ని ఉదాహరిస్తాను.

గురువు అనేక విధాలుగా దీక్ష ఇస్తారు. జపము, మంత్రము మొదలైన వాటి ద్వారా. అన్నింటి కంటే శక్తి వంతమైన దీక్ష మౌనము. శాస్త్రములు ఎంతటివైనా గురువు యొక్క మౌనదీక్షతో సాటిరావు. మౌనియైన గురువు శాంతి, శక్తులను ప్రసరింప చేస్తూ నిరాడంబరంగా నెమ్మదిగా శిష్యుని హృదయంలో పరివర్తన తీసుకువస్తాడు. ఆధ్యాత్మిక మార్గంలో గురువు యొక్క అవసరము ఎంతైనా ఉన్నది. అజ్ఞానాన్ని పోగొట్టే మహాగురువుకు శిష్యుడు శరణాగతుడు కావాలి. దేహాత్మదృష్టిని

వదలుకోవడమే నిజమైన శరణాగతి. గురువు శిష్యుని ప్రపంచ వ్యవహారాలను కూడా స్వీకరిస్తాడా అంటే తప్పకుండా సంకల్పాలన్నీ స్వీకరిస్తాడు. గురువు శిష్యునకు కావలసిన ఆధ్యాత్మిక అవసరాలను మాత్రమే. కాక సకల అవసరాలను తీరుస్తాడు. గురువు అగ్నివంటివాడు. శిష్యుడు బొగ్గువంటివాడు. బాహ్య గురువు సాకారమూర్తి అవసరమే. గురుశిష్యుల అనుబంధము ఎలా ఉండాలంటే గురువు శరీర మాత్రుడు కాదని ఆయన రూపం పోయిన తర్వాత కూడా సంబంధం కొన సాగుతున్నది అని చాలాసార్లు చెప్పడం జరిగింది. వేదాంత చూడామణిలో జ్ఞానిని గురువుగా ఆరాధించేవారు ముక్తిని పొందుతారని చెప్పబడింది. గురువు, ఈశ్వరుడు ఒకటే. పరిశుద్ధభక్తితో జీవుడు ఈశ్వరుని ఆశ్రయించినపుడు ఆ దయామూర్తి నామరూపాలు ధరించి గురురూపంలో ప్రత్యక్షమౌతాడు. అయితే పరిపక్వ జీవులకు మాత్రమే అట్టి ఆత్మగురువు సహాయం లభిస్తుంది. కైవల్యనవనీతం అనే గ్రంథంలో ఒక శ్లోకంలో ఇలా చెప్పబడింది - "ఓగురుదేవా! నీవు ఎల్లప్పుడు నాతో ఉంటూ, నాతోనే వస్తూ, జన్మలను ఎత్తుతున్నావు. నేను ముక్తి పొందేటంత వరకు నాతోనే ఉంటావు. "గురువు ఎంత వరకు అవసరం?" అంటే నీవు లఘువుగా ఉన్నంత వరకూ అవసరం. అంతటానిండి వెల్గుతున్న ఆత్మ శరీరం వరకు పరిమితం చేయడం లఘువు లక్షణం. ఏ లక్షణాలను బట్టి సద్గురువును గుర్తించాలి అని అంటే స్వపరభేదము లేక, ఎక్కువ తక్కువలు లేక, తర తమ భావాలు లేక ఏ భ్రాంతులూ చెందక, ఎట్టి పరిస్థితిలోనూ స్థైర్యము కోల్పోక ఎంత మాత్రమూ అహంకారము లేక, నిత్యమూ ఆత్మనిష్ఠ యందు ఉండువాడే సద్గురువు. అటువంటి గురువు నుండి దీక్ష తీసుకుంటే నిజమైన జ్ఞానం లభిస్తుంది. అప్పుడు వారు తమ వ్యక్తిత్వాలను కోల్పోతారు. లోకంలో చాలామంది ఎక్కడో ఆకాశం నుంచి గురువు యొక్క అనుగ్రహం వస్తుందని ఊహిస్తూ ఉంటారు. అనుగ్రహం నిజంగా హృదయంలోనే ఉన్నది. సాధకుడు మనస్సును అంతర్ముఖం చేయగానే అనుగ్రహం మహావేగంతో ముంచేస్తుంది. ఈ విధంగా రమణమహర్షి గురుతత్వాన్ని గురించి ఎన్నో విశేషాలు చెప్పాడు.

శ్వేతాశ్వతరోపనిషత్ దేవుని ఎటువంటి భక్తి ఉంటుందో గురువునందు కూడా అటువంటి భక్తి ఉంటే సర్వార్థములు లభిస్తవి అని చెబుతుంది.

**శ్లో।। యస్యదేవే పరాభక్తిః యధా దేవే తథాగురౌ**
**తస్యైతే కథితా హ్యర్థాః ప్రకాశన్తే మహాత్మనః**

ఆదిశంకరులవారు మనస్సు గురుపాదములు మీద లగ్నం కాకపోతే ఏ ప్రయోజనమూ ఉండదు అని అంటూ ఇలా అన్నారు

**శ్లో।। మనశ్చేనలగ్నం గురోరంఘ్రి పద్మే**
**తతః కిం తతః కిం తతః కిం తతః కిం**

మహాపురుషులైన గురువులు శిష్యులను ఎలా అనుగ్రహిస్తారో వారి చరిత్రల ద్వారా కొన్ని వందల ఉదాహరణలు దొరుకుతవి.

కావ్యకంఠ గణపతిముని "తిరువత్తి యూరు" అనే ఒక గ్రామంలోని దేవాలయంలో జపంచేసుకుంటూ ఉండగా మధ్యాహ్నం వేళ అలసిపోయి గురుదర్శనమైతే బాగుండును అని అనుకున్నప్పుడు సద్గురువైన రమణమహర్షి ఆకాశం నుండి దిగి వచ్చి ఆయన శిరస్సును తన ఒడిలో పెట్టుకొని శక్తి పాతం చేసిన అనుభూతి కల్గింది. తరువాతి కాలంలో మహర్షిని ప్రశ్నించినపుడు దానిని ఆయన ధ్రువీకరిస్తూ. తన భౌతిక శరీరం తిరువన్నామలైలో ఉన్నా తన సూక్ష్మశరీరం గగనయానం చేసి వెళ్ళినట్లుగా తనకూ అనుభూతి కల్గిందని చెప్పారు.

మహావతార్‌బాబా, మహాప్రభుజీ, రామకృష్ణ పరమహంస, కృష్ణచైతన్యస్వామి, హరిదాస్ మహారాజ్, హితహరివంశ్ మొదలైన మహాపురుషు లెందరో తమశిష్యులను, భక్తులను అనుగ్రహించిన కథలు అసంఖ్యాకములు. గురుదేవునే దేవతగా ఆరాధించినవారు, ఆశ్రయించినవారు ఏలా తరిస్తారో ఈ సంఘటనల ద్వారా మనకు తెలుస్తుంది. గురువుని దేవునిగా భావించే ఈ సంప్రదాయానికి భారతదేశంలో ఎంతో ప్రధానమైన స్థానం ఉన్నది

**అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరం**
**తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవేదమః**

+++

# కృష్ణం వన్దే జగద్గురుమ్

శ్రీ మల్లాది పున్నయ్యశాస్త్రి, గుంటూరు.

చాలామందియోగులు, యోగీశ్వరులున్నారు. కాని యోగమునకే ఈశ్వరుడై, యోగసిద్ధిని ప్రసాదించు ప్రభువు శ్రీకృష్ణుడు. మిగిలినవారిలో కొందరు జగద్గురువులుండవచ్చును. కాని శ్రీకృష్ణుడు జగత్తుయొక్క గురువు. మిగిలినవారికి జగత్తు రూపములోని భగవానుడు గురువు. కృష్ణుడు "నేను" అని చెప్పినచోటల్లా దేవకీ వసుదేవుల సుతుడననే కాక, సర్వాంతర్యామి అయిన "ఆత్మతత్త్వము" నని యర్థము. కొందరంటుంటారు. "రాముడు చేసింది చేయండి, కృష్ణుడు చెప్పినది చేయండి" అని. కృష్ణుడు చెప్పినవి చేయాలి అనేమాట నిజమే. కాని, అతడేమియు మనము చేయకూడనివి చేయలేదు. రామునివలెనే, కృష్ణుడు ధర్మకాయుడు. మనము చేయలేని పనులు కొన్ని అతడు పరమాత్మగా చేసినాడు. ఉదాహరణకు, గోవర్ధనోద్ధరణము, కాళీయమర్దనము, విశ్వరూప ప్రదర్శనము మున్నగునవి. తానాచరించియే, కృష్ణుడు ధర్మమును బోధించెను. పెద్దలయెడ వినయము, పారస్పర్య జీవనము, కృషికర్మ, గోపాలనము, యజ్ఞార్థమయిన లోకహితజీవనము, ధర్మసంరక్షణదీప్తి, అన్యాయమునకు గురిచేయబడిన వారిని తెగువతో గాపాడుట, విశ్వప్రేమ, విశ్వశాంతియం దపేక్ష, అఖండభారత నిర్మాణకృషి, నిత్యశిశుత్వ స్వచ్ఛత మన మనుసరింపదగిన కృష్ణుని కల్యాణ గుణములు.

కృష్ణు డుపదేశించిన భగవద్గీత, ఉత్తరగీతలు, ఉద్ధవగీత మున్నగునవి జగత్తుకు కరదీపికలు. భగవద్గీత యోగజీవనాన్ని, పారస్పర్యముతో కూడిన సామాజిక జీవనాన్ని, ప్రతిపాదిస్తుంది. సమాజ శ్రేయస్సులో భాగమే వ్యక్తి శ్రేయస్సు గావున కర్తృత్వ భావన, ప్రతిఫలాపేక్షలేక దేవుని పరికరముగా చేయవలసిన పనులను భగవదారాధనగా నిర్వర్తింపవలయును. చేయగోరినవి బంధమును కల్పించును. చేయవలసిన కర్మలు శాంతిని కల్పించును. మనకర్తవ్య కర్మలకు సంకల్పము అంతర్యామి నుండి రావలెను. మట్టియందు కుండలనువలె, సర్వమును దేవునియందు చూడవలెను. అంతర్యామి రూపులగు జీవుల యందు కరుణ, ప్రేమ నెరుపవలెను. సర్వపరిస్థితులలో సమత్వము వహింపవలెను. ప్రతి శరీరము రథము. రథికుడు నరుడగు జీవుడు. మనస్సను పగ్గమును అంతర్యామియగు సారథికి అప్పజెప్పిన విజయము లభించును.

ఇక ఉత్తర గీతలలో ఓంకారోపాసన, లోనిచోటు, బయటిచోటులలో ఒకే చైతన్యమును దర్శించుట, నిర్మల హృదయము, జనన మరణాతీతమైన అమృతస్థితి, ఆత్మనిష్ఠ ప్రబోధింపబడినవి. ఉద్ధవగీతలో పూర్వవాసనాభ్యాసము తొలగుటకు అంతర్యామి యందు సమర్పణ మభ్యాసము కావలెనని ప్రబోధింపబడినది. చూడగలిగినవి ప్రకృతి, అందలి వివిధ జీవులు గురువులై గుణపాఠములను నేర్పును, రాష్ట్రప్రజలు సుఖపడవలెననియు, తాను పవిత్ర శీలికావలె ననియు ఉత్తముడు భావించును. 'నా' వారుగా జీవ యాత్ర సాగించువారు విశ్వమును నాపాదముగా ఆశ్రయించెదరు. నేను రూపాతీతుడ నయినను, స్మరింవగలవారి కొక్కొక్కరూపముగా సిద్ధింతును. స్మరించినపుడెల్ల వారియందు 'నేను' వర్తించెదను. కురుసభలో రాయబార సమయమందును, కొందరు పొరపడినట్లుగా కృష్ణుడు సమరమును రెచ్చకొట్టలేదు. తన మానవ ప్రయత్నముగా విశ్వశాంతికై, సమర నివారణకై ప్రయత్నించెను. వరపక్షము వారిపై ప్రేమ, సహనముగల పాండవులకు తాను రక్షకుడననియు, వారిని కౌరవులు జయింవలేరనియు వలికెను. ప్రజానాశము కాకుండ, రాజ్యలోభమును విడువుడని బోధించెను. ధృతరాష్ట్రుడే మహారాజుగా నిలుచుననియు, ధర్మరాజుకు అయిదూళ్ళు జీవనోపాధికై రాజప్రతినిధిగా ఇమ్మనియు రాజీసూత్రము ప్రతిపాదించెను. యుద్ధసమయమున భీష్మద్రోణులు ఆశీస్సులను ధర్మరాజు పొందుటను హర్షించెను. అశ్వత్థాను నిద్రించుచున్న పిల్లలను అన్యాయముగా వధించినను, అతనిని విడిచి పెట్టుడని పాండవులకు బోధించెను. శ్రీకృష్ణుడు స్వయముగా నవతరింపలేదు. బ్రహ్మాదులు భూభారనిర్వాహణార్థమై వేడగా దిగివచ్చెను కృష్ణునికథ జగత్కథయే. కారాగారమున జన్మించుట యనగా, వరమాత్మ, జీవుడుగా తల్లిగర్భమున బడుట గోకులమునకు గొనిపోబడుట యనగా నేలపై దేహముతో బడుట. భాగవతము ప్రథమ స్కంధమున కృష్ణనిర్యాణము, దశమస్కంధమున అవతరణము అభివర్ణింపబడినవి. అనగా మొదటి మానమున వరమాత్మ తన అపరిమితత్వమును కోల్పోవుట వదియువమానమున జీవుడుగా దేహమున ప్రసవింపబడుట. కృష్ణుడు అష్టమహిషుల బెండ్లియాడెను. వారే

అతనిని వరించిరి. తానెవ్వరినీ కోరలేదు. అష్టప్రకృతుల నడుమ చరించుచున్న పరమాత్మున కవి అంటవనుటకు ప్రతీక, కృష్ణుడు. తన భార్యల నడుమ చరించుచున్నను సంగములో చిక్కుకొనకుండుట. పూతన స్తన్యము స్వీకరించి, కృష్ణుడామెకు మాతృస్థానమొసగి పూతనవత్వమును ప్రసాదించెను. కృష్ణుడు జన్మించు నాటికి, భారతదేశమును ప్రజాపీడకులగు కంస జరాసంధాదుర పాలనము సాగుచుండెను.

పాశ్చాత్యుల సాంస్కృతికమైన, రాజకీయమైన ముట్టడులతో వేదధర్మము అడుగంటుచుండెను. ఇట్టి ప్రజాపీడకులు కృష్ణుని వైపు ఆకర్షింపబడి, అతని నెదుర్కొని కాలధర్మము నొందిరి. కంసుడు, అతడు క్షుద్రతాంత్రి కోపాసనలతో బంపిన శకటాసురాదులు మరణించిరి. ఒక్కొక్క అసురుడు ఒక్కొక్క అసురభావనకు ప్రతీక. అంతర్యామి అయిన కృష్ణుని శరణందిన గోపాలకుల వంటి నిర్మల హృదయులకు దేహాత్మభ్రాంతి, కుఋచదనము, జడత్వము, పరపీడన రూపమగు పాపబుద్ధి, అల్లకల్లో పరచుతత్వము, త్రికాలములచే, కామక్రోధములచే చిక్కుకొనుట మున్నగు అజ్ఞానజనిత వాసనలనుండి విముక్తిని ప్రసాదించెను. యాంత్రికములగు క్రతువులకన్నను, నిర్మలభక్తికే కృష్ణుడు లొంగి అమృతానుభవమునొసంగెను. గోకులవాసుల సూక్ష్మదేహములను తన ప్రణవ గాంధర్వ గానమగు వేణుగానముతో నాకర్షించి, వారిని తన దివ్యదేహముతో తాకి, వారి ఆత్మలను తన అఖండచైతన్య స్రవంతిలో నదులవలె కలిపి రసానుభూతి నిచ్చెను. ఇదియే రాసలీల గోకుల వాసులకు విశ్వము విష్ణుమయముగా గోచరించి, వారెల్లరు ఒకే బృంద చైతన్యమున భాగములై, కృష్ణుని అవనము అనగా రక్షణము నొందిరి.

కృష్ణుడు జననీ జనకులగు దేవకీవసుదేవులకు, ఋషులగు సాందీపని వ్యాస నారదాదులకు ప్రణమిల్లి మనకు వినయము నేర్పెను. అనుదినము ప్రాతరుపాసన చేసెను గురువు పుత్రుల బ్రతికించియు, అది వారి యాశీస్సులవలననే అని పలికెను. కాలయవనుడు గర్గసుతుడగుటచే, వానిని స్వయముగా వధింపలేదు. పారిపోయినట్లు నటించి, మూడు లక్షల సైన్యము చావకుండ కాపాడెను. 16వేలమంది రాచకన్నెలను హరించిన నరకాసురుని చంపి, వారికి విముక్తి నొసగెను. వారే అతనిని వరించిరి. వారిని తానే వివాహమాడకున్నచో సమాజమున వారవమానితులగుదురు. వారిని వివాహమాడి, సంఘవ్యవస్థను గాపాడెను కొన్నివేలమంది రాజకుమారులను బలియిచ్చిన జరాసంధుని వధింపజేసి, జనులను రక్షించెను వివిధ పురములకు వెళ్ళినపుడు, తన సాన్నిధ్య మాధుర్యమును ఆయా పురవాసుల కొసగి, వారిని మోక్షమార్గము పట్టించెను.

దేశము విచ్ఛిన్నము గాకుండ, ధర్మపాలనకు అంకితుడైన ధర్మరాజును సార్వభౌముని జేయుటకు రాజసూయము గావింపజేసెను. ఆ యాగమున అతిథులకు తానే స్వయముగా వసతి, జలాదుల నేర్పాటుచేసి సేవించెను. యాగపూరణమునకై, శిశుపాలుని వధింపక తప్పలేదు. ద్రౌపదీ మానసంరక్షణము గావించెను. వనవాస కాలమున పాండవులవద్ద కొంతకాల ముండి, వారికి తన సన్నిధిలో ఓదార్పును, ధర్మసహనములలో శిక్షణ నొసగెను. తనకు జీవితమున కావలసినదిగాని, పొందరానిదిగాని లేదు. అయినను ధర్మస్థాపనకై, ఆశ్రిత వాత్సల్యమున పాండవులకు దూతగా, సారథిగా పనిచేసెను. అర్జున రథాశ్వములను స్నానమాడింపజేసెను. అధర్మ పక్షమున జేరి భీష్మాదులను వధించునెడ సామాజిక క్షేమమునుగోరి ధర్మనిర్ణయము జేసెను. తాను స్వయముగా జననాశన హేతువగు భారత రణమున బాల్గొనక, సాక్షిగా నిలిచెను.

కొన్నివందల యేండ్లవరకు కృతయుగ ధర్మము నిలబడుటకై, పరీక్షిత్తుని రక్షించి, తన ప్రతిమూర్తిగా అతనిని ప్రతిష్ఠించెను. కృషి కర్మ, గోపాలనములే నిజమైన సంపదయని చాటెను. అఖండ భారతదేశ నిర్మాణమునకై, ధర్మస్థాపనకై తన బ్రతుకునెల్ల యజ్ఞముగా సమర్పించెను. ద్వారకకు ఇతడే ఆశ్రయము. మానావమానములు, కష్టసుఖములు కృష్ణుని అంటలేదు. తనకు అండ యెవరని ఆతని కెప్పుడును చింత కలుగలేదు. కుమారుల, బంధువుల మరణ సన్నివేశమునకు బాల్యము నందువలె ఇతని చిరునవ్వు చెదరలేదు. శ్రీకృష్ణుడు నిత్యశిశువు, ప్రేమమూర్తి, ఆనంద రససింధువు, సద్గురువరేణ్యుడు. అంత్యమున ప్రాణత్యాగమునకు సిద్ధపడి, తన త్యాగముతో జీవులను ధర్మమార్గ వర్తనులను గావించెను. ఎందరికో ఎన్ని వైఖరులతో కానవచ్చినను, శ్రీకృష్ణుడు తనకు తాను అచ్చమైన పరమప్రేమ ముద్దకట్టిన మూర్తియే. ఉద్ధవ మైత్రేయులకు దివ్యబోధ జేసి, వారలలోనికి తన సూక్ష్మతేజోమయదేహమును ప్రవేశపెట్టి, భారతభూమి కలియుగాంతమువరకు అంతర్యామిగా నిలిచెను. ఈ శతాబ్దమునకు అరవిందాదులకు దర్శనమిచ్చి, కృష్ణుడు ఎందరో మహాత్ముల ద్వారా ధర్మస్థాపనకు, యోగవ్యాప్తికి కృషి చేయుచునే యున్నాడు. కృష్ణుని మించిన జ్ఞాని, యోగి, కర్మిష్ఠి, ప్రేమాత్ముడులేడు. మానవ శరీరములను రథములందు ఆత్మగానున్న ఆ మాధవుని దర్శించి, ఆశ్రయించి, మనము జనన మరణాతీతమగు అమృతత్వము నొందుదుముగాక.

+++

# గురుదేవులు శ్రీ సిద్ధేశ్వారనందభారతీ మహాస్వామి

డాక్టర్ ప్రేమకుమార్‌భార్గవ, గుంటూరు.

ధర్మచైతన్యాన్ని ఆధ్యాత్మిక సంపదను జగతిలో సన్నగిల్లకుండా చేయడానికి భగవదంశలో యుగ పురుషులు జన్మిస్తుంటారు. అటువంటి మహనీయులలో శంకరాచార్యులు ఒకరు. వారు భారతదేశమంతా సంచరించి పూరీ శృంగేరీ, ద్వారాకా, బదరీలలో శంకరపీఠాలు స్థాపించి తమ ప్రతినిధులుగా శిష్యులను అధిపతులుగా ఉంచారు. వారు జాతిని జాగృతం చేస్తూ పాలకులకు ప్రజలకు దిశానిర్దేశం చేస్తూ వారిలో కర్తవ్యదీక్ష, జ్ఞానజ్యోతులను వెలిగింప చేస్తుంటారు. సర్వసంగ పరిత్యాగులైన వారి నేతృత్వపరంపర ఇప్పటిదాకా అవిచ్ఛిన్నంగా నడుస్తున్నది.

అటువంటి పీఠాలలో శృంగేరీ ఒకటి. దాని పీఠాధిపతి శ్రీ సచ్చిదానందశివాభినవనృసింహభారతీమహాస్వామి వారి ఆదేశంగా 1910లో మౌనస్వామిగా ప్రసిద్ధి చెందిన శివచిదానందసరస్వతీస్వామి కుర్తాళంలో దత్తమఠాన్ని నెలకొల్పారు. అది నెమ్మది నెమ్మదిగా అభివృద్ధి చెందుతూ 1956లో సిద్ధేశ్వరీపీఠంగా రూపు దాల్చింది. శంకర సంప్రదాయంలో ఏర్పడిన ఈ పీఠానికి మౌనస్వామి తర్వాత, విమలానందభారతీస్వామి, త్రివిక్రమరామానందభారతీస్వామి, శివచిదానందభారతీస్వామి తరువాత నాల్గవ పీఠాధిపతిగా శ్రీసిద్ధేశ్వరానందభారతీస్వామికి దత్తపూర్ణిమనాడు పట్టాభిషేకం జరిగింది.

శ్రీ సిద్ధేశ్వరానందభారతీమహాస్వామి యత్యాశ్రమం స్వీకరించకముందు డాక్టర్ ప్రసాదరాయకులపతి కవిగా సుప్రసిద్ధుడు. అవధానిగా, ఆశుకవిగా, సభానిర్వహణదక్షునిగా, రూపక సమ్రాట్‌గా కొన్నివేల సభలలో సంచాలకబాధ్యతలు నిర్వహించి తనకు తనే సాటి అనిపించుకున్నవారు. రసవాహిని, ఆనంద యోగిని, రసగంగ, గంధర్వగీతి వంటి పద్యకావ్యములు, శివసాహస్రి, ఇంద్రీసాహస్రి, అంబికాసాహస్రి వంటి స్తుతి కావ్యములు, కవిబ్రహ్మ, కావ్యకంఠ వంటి నాటకములు, రమణీప్రియదూతిక వంటినవలలు, ఆంధ్ర భాగవత విమర్శ, కవితామహేంద్రజాలము వంటి పరిశోధన గ్రంథాలు, తాంత్రికప్రపంచం వంటి మంత్రశాస్త్ర గ్రంథాలు వ్రాశారు. 303 పైన సాహిత్య రూపకాలను సృష్టించి ఆంధ్రరాష్ట్రంలోనే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలోను, అమెరికాఖండంలో న్యూయార్క్ నుండి కాలిఫోర్నియాదాకా ఉన్న మహానగరాలలో కవి పండిత బృందంతో పర్యటించి వందలకొద్దీ రూపక ప్రదర్శనలు ఇచ్చారు. తెలుగు పద్యవిద్యావైభవాన్ని దశదిశలా వ్యాపింపచేశారు.

మహనీయులైన కులపతిగారిని వారి ప్రతిభా పాండిత్యాలకు మెచ్చి ఎందరెందరో ఎన్నో సంస్థలు అవధాని శేఖర, ఆశుకవి కేసరి, ప్రౌఢభారతి, కవిమల్ల, కవితాసుధాకర, సరస్వతీకంఠాభరణ, సిద్ధభార్గవ, శ్రీవిద్యాదేవ వంటి బిరుదులతో సన్మానించారు. సువర్ణఘంటాకంకణములు, గండపెండేరములు, రత్నకంకణాలు, రత్నాంగుళీయకములు, రత్న కిరీటములు, కనకాభిషేకములు చేసి సత్కరించారు. ఆధ్యాత్మిక సంపన్నులైన శృంగేరీ, కంచి, పుష్పగిరి పీఠాధిపతులు, సత్యసాయిబాబా, విశ్వయోగి విశ్వంజీ వంటివారు బంగారు గొలుసులతో, నవరత్నహారాలతోనూ, తెలుగు విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారాలతోనూ గౌరవించారు. ముఖ్యమంత్రులు, రాష్ట్ర పతులు, గవర్నర్లు సన్మానించారు. కులపతిగారు వ్రాసిన గ్రంథాలపై పరిశోధనలు చేసి డాక్టర్ పట్టాను పొందిన వారున్నారు.

శ్రీ కులపతిగారు సాహిత్యరంగంలో ఎంత ప్రసిద్ధుడో వ్యాయామరంగంలో కూడా అంతప్రసిద్ధుడే. శారీరక బలసాధనలో భాగంగా కుస్తీ, వెయిట్ లిఫ్టింగ్, ముష్టియుద్ధాలలో ప్రావీణ్యం సంపాదించి బలప్రదర్శనలు కూడా ఇచ్చారు. గడ్డపారలు వంచుట, గొలుసులు త్రెంచుట వంటివి చేశారు. అఖిలభారత కుస్తీ పోటీలలో అధికారిగా కూడా పనిచేసి విశిష్ట గౌరవాలు పొందారు. విచిత్రమేమిటంటే సాహిత్య ప్రదర్శనల కన్నా ముందు శారీరక ప్రదర్శననే వారు లోకానికి చూపించారు.

ఇక సాహిత్య, మల్లరంగాలలో ఉన్నకాలం నుండీ కూడా ఆధ్యాత్మిక రంగంలో వారు విశేషమైన కృషిచేశారు. సరస్వతీ ఉపాసకునిగా సాహిత్యరంగంలో విజయం సాధించి, ఆంజనేయోపాసకుడై మల్లరంగంలో ఆరితేరి, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు దూకి 'లంబికయోగము' 'ఖేచరీముద్ర' వంటివి సాధించారు. మంత్రసాధనతో పాటు ధ్యాన సాధనలో సమాధిస్థితి వేగంగా లభించింది. ఒకరోజు ధ్యానంలో కులపతిగారి సూక్ష్మశరీరం ఇంటి పైకప్పు మీదకు చేరింది. క్రిందివారి భౌతిక శరీరం ఉన్నది. భౌతిక శరీరంలో నుండి తాను బైటకు వచ్చిన అనుభవం కల్గి మరణించాననుకున్నారు. భయము దుఃఖము రెండూ కలిగాయి. తర్వాత నెమ్మదిగా మంత్రం జ్ఞాపకం వచ్చి చేయగా సూక్ష్మ శరీరం భౌతిక శరీరంలోకి ప్రవేశించింది. ఆ తర్వాత ఇటువంటి అనుభవాలు యోగసాధన వల్ల ఎన్నోసార్లు కలిగాయి.

'దైవాధీనం జగత్సర్వం - మంత్రాధీనంతు దైవతం' కనుక దేవతల అనుగ్రహం కావాలంటే మంత్ర సాధన చేయాలి. సిద్ధగురువు అయిన పసుమాముల సుబ్బరాయశాస్త్రిగారు దత్తాత్రేయ కార్తవీర్యార్జున, నాగాస్త్రాది మంత్రాలను ఉపదేశించారు. గురుకృపవల్ల

ఆ మంత్రదేవతల సాక్షాత్కారం లభించింది.

మొదటిసారిగా రమణమహర్షి చరిత్ర వ్రాసిన 'కృష్ణభిక్షు' గారి సాహచర్యంలో కావ్యకంఠ వాసిష్ఠ గణపతిముని రచనలపై మనస్సు పోయింది. గణపతి ముని ప్రభావం కులపతి గారిపై బలంగా ఉన్నది. 'ఛిన్నమస్త' ఉపాసనచేశారు. ఉద్యోగ సంబంధమైన చిక్కులను ఆ దేవత అనుగ్రహంతో దాటగలిగారు.

కృష్ణభిక్షువు గారితో కలసి మొదటిసారి బాపట్ల దగ్గర గల జిల్లెళ్ళమూడిలో అమ్మ దర్శనం చేసుకున్నారు. అమ్మ చూపిన వాత్సల్యానికి వశులై 'అంబికాసాహస్రి' అనే వెయ్యి పద్యాల కావ్యాన్ని రచించారు. అవతారమూర్తిగా ప్రసిద్ధిచెందిన అమ్మ సిద్ధిపొందిన తర్వాత కూడా రెండుసార్లు అమ్మను ఆవాహన చేయగా, అమ్మ వచ్చి దర్శనం ప్రసాదించటం, తపస్సాధకునకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పటం జరిగింది.

తపస్సాధన, ఉపాసనల ఫలితంగా కులపతిగారు ఎందరో మృతజీవుల ఆత్మలతో మాట్లాడటం జరిగింది. దక్షిణాపథంలోని ఒక వాగ్గేయకారుడు వైకుంఠంలో సారూప్య సిద్ధిపొంది ఒకచిన్న తప్పిదం, పరమశివునికు చేసినందువల్ల ఏలా అక్కడ నుండి క్రిందకు త్రోయబడ్డాడో చెప్పి, కాశీవిశ్వనాధుని కృపపొందాలంటే భైరవుడు కాశీక్షేత్రపాలకుడు కాశీలో అడుగు పెట్టనీయకుండా అడ్డుకుంటున్నాడని భైరవుని తన కొరకు ప్రార్థించి తనకు విశ్వనాథ దర్శనాకావకాశం కల్పించమని అర్థించాడు. ఇలాంటివి ఎన్నో సంఘటనలున్నాయి, వారి జీవితంలో కులపతిగారు దశమహావిద్యలలోని మాతంగి సాధనచేయగా ధ్యానసమయంలో దర్శనమిచ్చి అరగంటసేపు వీణానాదాన్ని వినిపించింది. పరశురామునితో ఉన్న అనుబంధం వల్ల రేణుకా పంచాక్షరి చేయగా ఆమె తన దర్శనాన్ని ప్రసాదించింది.

రసయోగి రాధికాప్రసాద్ మహారాజ్‌గారి యోగశక్తులచే ఆకర్షింపబడ్డ శ్రీ కులపతిగారు రాధాదేవి మంత్రసాధన చేశారు. దాని ఫలితంగా ఎన్నో దివ్యానుభూతులు పొందారు. కృష్ణుని మురళీనాదం విన్నారు. రాధాదేవి తానే స్వయంగ అష్టాక్షరీ మంత్రం ఉపదేశించింది. తన భక్తురాలయిన దుర్గాసఖి భద్రను కులపతిగారికి రక్షగా నియమించింది.

ఇంతలో మరొక విచిత్రం జరిగింది. కులపతిగారు పూర్వ జన్మలో ఆరాధించిన కాళీమాత విగ్రహరూపంలో ఆకాశమార్గంలో రావటం ఒక సిద్ధసంకల్పం. 160 సంవత్సరాలు గల కపాలేశ్వర కాళిదాస్ అనే పూర్వజన్మ శిష్యుడు తాను హిమాలయాలకు తపస్సుకు పోతూ కులపతిగారికి ఈ విగ్రహాన్ని సమర్పించాడు. అప్పుడే పూజలందుకున్న విగ్రహం రావటం 15 మంది సాధకులు చూశారు. దానికి తర్వాత దేవాలయం నిర్మించారు. గత 8 సంవత్సరాలుగా నిత్యపూజలు, నిత్యహోమాలు జరుగుతున్నవి. ఆకాళీమాత ప్రత్యక్షమైనప్పుడు కులపతిగారు **"అంటిన ప్రేమ వచ్చెను స్వయంభువుగా హిమశైలమందు, నే దుంట కళింగ భూముల నహో ! శతషట్క సువర్ణమూర్తియై గుంటూరిలోని నన్ మరల గోరి వియత్తలనుండి దేవతల్ ఘంటలో మ్రోయ విగ్రహముగా దిగివచ్చిన కాళిగొల్చెదన్"** అని పలికారు.

600 ఏండ్లు హిమాలయాలలో కులపతి చేసిన తపస్సుకు మెచ్చి అవతరించిన కాళీదేవిని ఆరాధిస్తున్న కాలంలోనే చిత్రమైన పరిణామం వారి జీవితంలో చోటు చేసుకొన్నది. సన్యాసం తీసుకోవాలన్న ఆశ బలీయమైంది. కుర్తాళ సిద్ధేశ్వరీపీఠాధిపతి శ్రీ శివచిదానందభారతీస్వామిని ఈ విషయమై అభ్యర్థించారు. వారు సంతోషించి పీఠానికి ఉత్తరాధికారిగా ఉండమన్నారు. కాని కులపతిగారు గుంటూరులో కాళీదేవి వద్ద కొంతకాలం, బృందావనంలో రాధాదేవి వద్ద కొంతకాలం ఉందామని ఆలోచన అన్నారు. వారు అలాకాక మీ ఇష్టదేవతను అడగండి ఆమె చెప్పినట్టు చేయండి అన్నారు. ధ్యానంలో కూర్చోగా సిద్ధేశ్వరి సాక్షాత్కరించి బృందావనంలో గుంటూరులో ఉన్నది నేనే కుర్తాళానికి రా అన్నది. ఆమె ఆజ్ఞ పాటించారు శ్రీ కులపతి. ఉత్తరాధికారిగా బాధ్యతలు స్వీకరించిన మూడునెలలకే శ్రీ శివచిదానందభారతీ స్వామి సిద్ధిపొందటం వీరికి దత్తజయంతి నాడు పీఠాధిపతిగా పట్టాభిషేకం చెయ్యటం జరిగింది.

ఈ పీఠబాధ్యతలు నెత్తినపడగానే నెల్లూరు, విశాఖ, విజయవాడ పీఠాలకు కూడా అధిపతి కావడం జరిగింది. దానితో పాటు పీఠ ఆస్తులు ఆక్రమించుకున్న వారితో ఘర్షణలు, వివాదాలు, బెదిరింపులు, కోర్టు వ్యాజ్యాలు, చికాకులు. వీటన్నింటినీ అధిగమించడానికి లలితాదేవికి విన్నవించగా ఆమె వాత్సల్యంతో శత్రుంజయమైన అద్భుత మంత్రాన్ని స్వయంగా ఉపదేశించింది. కొద్దిపాటి జపసాధనలతో సమస్యలన్నీ పటాపంచలు కావటం జరిగింది.

అప్పుడు స్వామి లలితాదేవిని స్తుతించిన పద్యం చూడండి.

**ఉపదేశమొనరించె కృపతోడ నే దేవి**
**శత్రుంజయంబైన శాక్తవిద్య**
**అరుణారుణంబైన తరుణసుందరమూర్తి**
**దర్శనంబిచ్చె నే ధర్మవీర**
**పిలిచి స్వయమ్ముగా పీఠత్రయాధీశు**
**చేసె నే మహనీయ సిద్ధమాత**
**రచియింప జేసె నే రసమహాసమ్రాజ్ఞి**

ఘనరహస్యంబైన రసచరిత్ర
సుకవిగా దీర్చి దివ్యమౌ స్ఫురణ నిచ్చి
యోగిగా మార్చె నన్ను నే రాగమూర్తి
ఆ సకలనేత్రి సిద్ధేశ్వరీసవిత్రి
**'లలిత' నా గుండె గుడిలోన నిలుచుగాక !**

ఇక స్వామి ఉపాసనలో భైరవసాధన ఒక విశిష్టతను సంపాదించుకొన్నది. రాధాదేవి - కాళీదేవి - లలితాదేవి ప్రధాన స్థానాన్ని ఆక్రమించుకోగా భైరవుడు స్వామి సాధనలో ప్రవేశించాడు. అభౌమభూమికలనుండి కాలభైరవ మంత్రోపదేశం జరగటం, భైరవ సాధన చేయటం జరిగింది. కాశీలో ఉండగా భైరవుడు స్వామితో వచ్చిన ముగ్గురికి మరణగండం ఉందని తెలియచేయగా స్వామి వారిని రక్షించటానికి భైరవోపాసనచేశారు. స్వామి మీద ప్రేమతో భైరవుడు వారిశిష్యుల గండం తప్పించాడు. ఆ సమయంలో

**'రజ్జువు దాల్చి వచ్చు యమరాజును వెన్నకు పంప గంగలో**
**మజ్జన మాచరించి నిశిమధ్యను ధ్యానముసేయ శూలియై**
**గజ్జెల నొప్పు స్వీయపదకంజములన్ గమనింపజేయు నా**
**కజ్జల రూపునిన్ దలతు కాశిక నేలెడు కాలభైరవున్"**

అని చెప్పారు స్వామి.

ఈ ధ్యానసాధన సమయాలలోనే స్వామికి తమ పూర్వ జన్మలు ఒక్కొక్కటీ స్మృతికి రావటం మొదలైంది. పరమాత్మ నారాయణుని అంశలో జన్మించిన కపిలమహర్షి మిత్రుడైన జైగీషవ్యుడనే మునిగా కొంతకాలం సాధనచేశారు. కాశీలో కూడా జైగీషవ్యుని గుహ ఇప్పటికీ ఉన్నది. ఆ తర్వాత 'సిద్ధనాగుడు'గా నాగజాతిలో జన్మించారు. బ్రహ్మపుత్ర, ఇక్షుమతి నదుల ఒడ్డున సంచరించారు. ఆ సమయంలో పరశురాముని శిష్యరికం చేసి కాళీమంత్రాన్ని పొంది కామాఖ్యలో కాళీసాధన చేశారు. తరువాత బృందావనం చేరి రాసమండలిలో రాధాకృష్ణులు సలిపే రాసకేళిని చూసే అవకాశం లభించి కృష్ణమంత్రజపంతో స్వామి అనుగ్రహంతో కృష్ణుని మురళీనాదం వినటం, తద్వారా రాధాసాధన చేయటం, దానివల్ల ఎన్నో దివ్యానుభూతులు పొందటం జరిగింది.

సిద్ధనాగుడు తన మిత్రులైన శివనాగుడు, రాజనాగునితో కలసి భోగనాధుని పిలుపుపై వారణాసికి, కుర్తాళానికి వెళ్లటం జరిగింది. వీరిలో రాజనాగుడు అగస్త్యుని దయవల్ల సిద్ధుడై తర్వాత మహావతార్‌బాబాగా, శివనాగుడు మౌనస్వామిగా, జన్మలు మారి వచ్చారు. సిద్ధనాగుడు భైరవనాధునిగా, ఏసుక్రీస్తు శిష్యుడైన జాన్‌గా, తర్వాత భానుదేవునిగా, కాళీయోగిగా, జన్మలు పొందటం జరిగింది. ఇప్పుడు సిద్ధేశ్వరానందభారతీస్వామిగా మౌనస్వామి కోరికపై కుర్తాళ శ్రీసిద్ధేశ్వరీపీఠానికి అధిపతికావటం కూడా పూర్వనిర్ణయాలలో భాగమే.

సిద్ధేశ్వరానందభారతీస్వామి యత్యాశ్రమం స్వీకరించటానికి ముందు వారు గుంటూరు జిల్లా అప్పటి నర్సరావుపేట తాలూకా ఇప్పటి ఒంగోలుజిల్లా అద్దంకి మండలం ఏల్చూరు గ్రామంలో శ్రీవత్సగోత్రీకులు, ఆర్వేలనియోగి బ్రాహ్మణులు అయిన పోతరాజు వారింట జన్మించారు. సుప్రసిద్ధులైన ఆశుకవులు కొప్పరపువారికి గురువులైన పోతరాజు రామకవిగారు వీరి ముత్తాత. అవధానిభూషణ, కవిసింహ బిరుదులు పొందిన అవధాని లక్ష్మీనరసింహకవి వీరితాత. అవధాని,పురుషోత్తమ చరిత్రాది గ్రంధాలు వ్రాసిన పురుషోత్తమకవి వీరి తండ్రి కొప్పరపు వారి ఆడపడుచు స్వరాజ్యలక్ష్మి వీరి తల్లి. వీరికి తల్లిదండ్రులు పెట్టినపేరు వెంకటలక్ష్మీవరప్రసాదరావు. భార్గవ విద్యదేవకులపతిగా, ప్రసాదరాయకులపతిగా తమ సాహిత్య ప్రసారాన్ని ప్రారంభించి దిగ్దిగంతాలదాక తెలుగు వెలుగులు విరజిమ్మి ఖ్యాతి గడించి విరాగియై సిద్ధేశ్వరానందభారతీగా రూపుదాల్చారు.

కుర్తాళం పీఠాతివతి 16 ఏళ్ళ చిన్నతనంలోనే సన్యాసాశ్రమం స్వీకరించాలనుకున్నారు. శ్రీత్రివిక్రమరామనంద భారతీస్వామి కులపతిగారిని మిత్రుల ద్వారా పీఠానికి రమ్మని కబురు చేశారు. కులపతిగారు కూడా ఆశ్రమ స్వీకారం చేయాలనే అనుకున్నారు. అయితే తల్లి దండ్రులకు పెద్ద కొడుకు కావటంతో వారు అంగీకరించలేదు. అప్పుడాగి పోయింది.

తరతరాలుగా ఆధ్యాత్మిక, సాహిత్యవరంవర కొనసాగుతున్న కుటుంబంలో పూర్వజన్మ సంస్కారం వల్ల జన్మించి నేటికి జగద్గురువుగా వరిణామం చెంది ధర్మ చైతన్యయాత్రలు చేస్తూ ప్రజలలో దార్మిక చైతన్యాన్ని కల్గిస్తున్నారు తపోధ్యాన మార్గాలలోనికి ప్రజలను మళ్ళించి భౌతిక ఆధ్యాత్మిక మార్గాలలో వారికివారే తరించేమార్గాలను సూచిన్నారు. వందలవేల మందికి మంత్రోపదేశాలు చేస్తున్నారు.

శంకరులు దేశంలో తూర్పున పూరీలో తాంత్రిక పీఠాన్ని, దక్షిణంలో జ్ఞానపీఠాన్ని, పశ్చిమాన ద్వారకలో శాంతపీఠాన్ని, ఉత్తరాన బదరీలో శారదాపీఠాన్ని స్థాపించిగా, అగస్త్యుడు మౌనస్వామి కుర్తాళంలో యోగపీఠాన్ని నెలకొల్పారు. సిద్ధేశ్వరానందభారతీస్వామి సిద్ధపీఠంగా మార్చి అందరినీ తపస్సు చేయటానికి కుర్తాళానికి రమ్మని ఎలుగెత్తి పిలుస్తున్నారు రండి తరించండి.

# జగద్గురువు విద్యారణ్యుడు - ఒక చారిత్రక భూమిక

శ్రీ సాములపర్తి సదాశివరావు

14 వ శతాబ్దం నాటికి దక్షిణ భారతదేశంలో దేవగిరి, ఓరుగల్లు సామ్రాజ్యాలు ప్రముఖమైనవి. ఈ రాజ్యాల మధ్య తరచు స్పర్ధలు, దాడులు జరుగుతుండేవి. కాకతీయ రుద్రదేవులు, మహదేవరాయలు దేవగిరిరాజ్య బందీలుగా మరణించారు. గణపతిదేవుడు కూడా కొన్నాళ్లు నిర్బంధంలో ఉన్నాడు. పిదప రేచర్ల రుద్రసేనాని ద్వారా విముక్తి చెంది ఓరుగల్లుకు తిరిగి వచ్చి చాలాకాలం రాజ్యపాలన కొనసాగించాడు. అప్పటికే ఉత్తరభారతం ముస్లిం దాడులకు దురాక్రమణలకు, గురియైంది. తుదకు ఖిల్జీ రాజులు దేవగిరిని ఆక్రమించి హరిపాలదేవుని వధించి శవాన్ని కోటగుమ్మానికి వ్రేలాడ దీశారు. పిదప దేవగిరి రాజ్య సైన్యాల అండతో క్రీ.శ. 1318లో మల్లిక్‌కాఫూర్ ఓరుగల్లును లొంగదీశాడు. ఈ దాడిలో వరంగల్ రాజ్య కోశాధికారులు హరిహరబుక్కరాయలు కంపిలికి పారిపోయారు. 1323లో మహమ్మద్‌బిన్.తుగ్లక్ ఓరుగల్లు పై దాడిచేసి కాకతీయ ప్రతాపరుద్రుని బందీగా ఢిల్లీకి తరలిస్తుండగా దారిలో ఆయన నర్మదానదిలో దుమికి మరణించాడు. ఆ విధంగా కాకతీయ సామ్రాజ్యం అంతరించింది.

కాకతీయరాజ్య బలహీనతను ఆధారం చేసికొని వారి సైన్యాల అండతో ఢిల్లీ సుల్తానులు మధురలో పాండ్యులను, ద్వారసముద్రంలో హోయసలులను లొంగదీసుకున్నారు. ఆ రూపంలో ముస్లిం రాజ్య విస్తరణ పెంపొంది దక్షిణ భారతదేశంలో అమిత కలవరానికి దారి తీసింది.

ఈ స్థితిలో కాపయనాయకుడు వరంగల్ కోటను తిరిగి గెలుచుకొని ఢిల్లీ సుల్తానుల ప్రతినిధియగు మల్లిక్ మఖ్బాల్‌ను ఓడించాడు. ఆంధ్ర సురత్రాణ (సుల్తాన్) బిరుదంతో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. మరొకవంక హరిహర బుక్కరాయలు ఆనెగొంది (కంపిలి ప్రాంతంలో) ముస్లిం ఆధిపత్యాన్ని ఎదిరించారు. స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. మహమ్మద్ బిన్ తుగ్లక్ మేనల్లుడు బహావుద్దిన్‌ను ఓడించి తరిమివేశాడు.

తుగ్లక్ రాజ్యకాలంలో ఢిల్లీ సామ్రాజ్యం ఎన్నో తిరుగుబాట్లకులోనై ఛిన్నాభిన్నమైపోయింది. మహమ్మద్ బిన్ తుగ్లక్ రాజధానిని ఢిల్లీనుండి దేవగిరికి తరలించాడు. ఉత్తర ప్రాంతంలో తిరుగుబాట్ల మూలంగా మరల, దేవగిరినుండి ఢిల్లీకి రాజధానిని మార్చవలసివచ్చింది. ఈ రాజధాని మార్పిడులలో వందలాదులుగా రాజకీయోద్యోగులు దారుణమరణాలకు గురియైనారు. అంతేగాక ఢిల్లీలో తుగ్లక్ కోటగుమ్మం ముందు ప్రతిరోజు వందలాది ముస్లింసర్దారుల రక్తపుటేరులు ప్రవహించేవని'బర్ని' ఖేదపూర్వకంగా వర్ణించాడు. మహమ్మద్ బిన్ తుగ్లక్ ప్రజలను ద్వేషించాడు. సహచరులను పీడించాడు. తండ్రిని దారుణ కుట్రకు బలిచేశాడు. ఎదిరించిన వారినెల్ల కత్తికి ఎరగా వధచేశాడు. అందుకే అతనిని చరిత్రకారులు వెర్రివాడని కూడా వ్యాఖ్యానించారు. ఆ రోజులలోనే దక్షిణ భారతంలో విజయనగర సామ్రాజ్యం, పిదప బహమనీ సామ్రాజ్యమేర్పడడం జరిగింది. విజయనగర సామ్రాజ్య స్థాపనలో ప్రముఖపాత్ర విద్యారణ్య, హరిహరబుక్క రాయలదేనని సువిదితాంశమే. ఈ విషయాన్ని న్యూయాజ్, ఇహన్‌బతూతా, రాహర్ట్ సెవెల్, సి.యె.స్మిత్ మున్నగు చరిత్రకారులు ఆమోదించారు. విద్యారణ్య వృత్తాంతం గురువంశ కావ్యం, కెలడిన్పవ విజయం, మున్నగు స్థలపురాణాలు సమర్థించాయి. కాపతోరు, కోలారు, టుంకూరు, కదూరు మున్నగు పలుశాసనాలు వివరంగా పేర్కొన్నాయి.

**హరిహర బుక్కరాయలు యెవరు?**

మంగళగిరి మండలాధిపతిగా కాకతీయుల కాలంలో సంగముడని ఒకరున్నారు. అతనికి హరహర, కంప, బుక్కమారప్ప, ముద్దప్ప అని ఐదుగురు కొడుకులు. సంగముని ఆస్థానమంత్రి మాయన. ఆయన కొడుకులు మాధవ, సాయణ, భోగనాథులని ముగ్గురు. ఇందులో హరిహరుడు, బుక్కరాయలు, మాధవుడు, సాయణుడు ఓరుగల్లు ప్రతాపరుద్ర ఆస్థానంలో కోశాధికారులుగా వ్యవహరించారు. 1318లో జరిగిన మల్లిక్ కాఫూర్ దాడిలో వీరు వరంగల్ నుండి ప్రాణరక్షణ కోసం చెల్లాచెదురైనారు. హరిహరబుక్కరాయలు తుంగభద్రా తీరమైన పంపలో స్థిరపడ్డారు. తన మేనమామ రామనాథుని కొలువులో చేరారు. (పరదార సోదర రామకథ ఆధారం). అతని అనంతరం స్వాతంత్ర్యం ప్రకటించుకుని ప్రభువులైనారు. కాని తుగ్లక్ ముస్లిం సేనలు వారిపై దాడిచేసి బందీలుగా ఢిల్లీకి తరలించాయి. సుల్తాను వారిని ముస్లిం మతంలోనికి మార్చాడు. తమ ప్రతినిధులుగా రాజ్య విస్తరణ జరుపుటకు గాను వారిని దక్షిణ ప్రాంతానికి పంపించారు. వారు మూడవ భల్లాలుని చేతిలో ఓడిపోయారు. పిదప రేవణ సిద్ధుని ఆదేశం మేరకు, హంపిలో విద్యారణ్యుని ఆశ్రయించారు. ఆయన వారిని తిరిగి

హిందూమతంలోకి మార్చారు. పిదపవారు ఆనెగొంది (కంపిలి) మూడవ భల్లాలుని ఓడించారు. స్వాతంత్ర్యము ప్రకటించుకున్నారు. ఆ పిదప విద్యారణ్యుని ఆశీస్సులతో 1336 లూ విజయనగర సామ్రాజ్య స్థాపనతో ప్రసిద్ధులైనారు.

**విద్యారణ్యులు ఎవరు?**

సంగమరాజ్య మంత్రి మాయణుని కుమారుడగు మాధవులే విద్యారణ్యులు అనియు, ఆయన రెండవ తమ్ముడు భోగనాధుడే శృంగేరి పీఠాధిపతియగు భారతీతీర్థులనియు, పలు గ్రంధాలలో నుదహరింపబడియుంది. హరిహరబుక్కరాయల ఆస్థానంలో మాధవ, మాయణులు బహుముఖపాత్ర వహించి యున్నారు. హిందూ సంస్కృతి విస్తరణ కొరకు వారు వేదశాస్త్ర పురాణాల విపుల వ్యాఖ్యానానికి పూనుకుని అనేక గ్రంధాలు వ్రాశారు. ఆస్థానంలోనూ ప్రజానీకంలోనూ అమిత గౌరవం పొందారు. పీఠానికి రాజలాంఛనాలను ఏర్పరచారు. విజయరగర సామ్రాజ్యమును అనేక విధాల విస్తరింపజేసి స్థిరపరచారు. ఆ చరిత్ర సువిదితము.

బుక్కరాయల ఆస్థానకవి నాచన సోముడు ఆంధ్రుడే. ఈయన ఉత్తరహరివంశము వ్రాసి పెంచికలదిన్నె అనే గ్రామాన్ని అగ్రహారంగా పొందాడు. బుక్కరాయల కోడలు గంగాదేవి మధురావిజయకావ్యంలో కాకతీయ ప్రతాపరుద్ర ఆస్థానపండితులగు అగస్త్య, విద్యానాధులను ప్రశంసించింది. ఈమె అగస్త్యుని శిష్యురాలట. ఆమె తిక్కనసోమయాజి కవితను శ్లాఘించింది. హరిహరబుక్కరాయల సోదరులు మారప్ప చంద్రగుట్టి సీమలో ఆంధ్రప్రాంత తెలుగు పండితులకు అగ్రహారంగా ఒక గ్రామం ఇచ్చాడు. కావలి తాలూకాలోని శ్రీకంఠపురాగ్రహరము (బిట్రగుంట), శ్రీబుక్కరాయపుర (బ్రాహ్మణకర్క) అగ్రహరమూ సాయణపండితుని పేర, ఆయన సహాయకులగు వేదపండితుల పేర హరిహరుడు ధారాదత్తం చేశాడు. శ్రీ కంఠుడు మాధవ, సాయణుల తొలి గురువు. కంపరయల మరణానంతరం ఆయన కుమారుడు రెండవ హరిహరరాయలు పై అగ్రహారాలు ఇచ్చాడని డా॥ మునుగంటి కృపాచార్యులు తమ పరిశోధనా పత్రంలో వివరించియున్నారు. ఈ ఆధారాలును బట్టి మాధవసాయణులు ఆంధ్రప్రాంతీయులని తేలిపోతుంది.

మాధవాచార్యుడు లేక విద్యారణ్యులు హంపి విరూపాక్ష పీఠాధిపతిగా చాలాకాలం వ్యవహరించారు. ఆయన సమాధి హంపిలో ఉందనేది సువిదితాంశమే. విద్యానగర లేదా విజయనగర రాజధానీ నిర్మాణంలో విద్యారణ్యుని ప్రముఖపాత్రను గురించి అనేక శాసనాధారాలున్నాయి. అనేక స్థల పురాణాలున్నాయి. కావున ఆ విషయం నిర్వివాదాంశమే. విజయనగర సామ్రాజ్యమునకు చెందే వరాహలాంఛనం, అర్కేందు చిహ్నం మరియు రాజగురువుల కాలాముఖశైవం మున్నగు అంశాలు కాకతీయ సామ్రాజ్య వారసత్వం సంస్కృతి నిదర్శనాలేననికూడా ఈ సందర్భంలో అవగతమౌతుంది.



విశాఖ లలితాపీఠంలో కవయిత్రుల సమ్మేళనము మరియు ప్రేక్షకులు



## వ్యాసమహర్షి

శ్రీమతి కుసుమ కె.మూర్తి

వశిష్ట మహర్షి కుమారుడు పరాశరుడు ఆతడు దాశరాజు పుత్రిక సత్యవతి అందానికి ముగ్ధుడై వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు ఉద్భవించాడు. అతడు నీలవర్ణంలో ఉండటం వలన 'కృష్ణ' అనీ, యమునా నది రెండు పాయలుగా చీలగా మధ్యనున్న ప్రదేశంలో జన్మించటం వలన 'ద్వైపాయనుడ' నీ, వేదాలను వర్గీకరించటం వలన 'వేదవ్యాసుడ'నీ, ఆయన రమ్యకుటీరం బదిరిలో ఉండటం వలన 'బాదరాయణుడ'నీ, ప్రసిద్ధి గాంచాడు. దైవాంశ సంభూతుడు కనుక జన్మించగానే దివ్యజ్ఞానం కలిగింది. వేదాలలో, శాస్త్రాలన్నింటిలో, పురాణాలలో ఇతర విజ్ఞాన శాస్త్రాలలో నిష్ణాతుడైనాడు. మాతృమూర్తి చరణ కమలాలకు సాష్టాంగ దండప్రణామం చేసి 'మాతా! నీ వెప్పుడు నన్ను తలుచుకుంటే అప్పుడు నీ ఎదుట నిలుస్తాను. ప్రస్తుతం బదిరికాశ్రమానికి వెళ్లి తపోనిష్టలో ఉంటాను. అనుజ్ఞ ఇయ్యి తల్లీ!' అని ప్రార్థించగా ఆమె శుభాశీస్సుల నందించి పంపింది. కాలం వేగంగా పరుగెత్తింది.

శంతనుడనే మహరాజు సత్యవతిని మోహించి వివాహం చేనుకున్నాడు. వారికి చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడనే పుత్రులు కలిగారు. చిత్రాంగదుడు పసితనంలోనే మరణించాడు. విచిత్రవీర్యుడు అంబిక, అంబాలిక అనే స్త్రీలను వివాహం చేసుకున్నాక విధివక్రించి మరణించాడు. నిర్వంశం అవుతుందని సత్యవతి దుఃఖించి వ్యాసుడిని తలుచుకొంది. క్షణంలో ప్రత్యక్షమైనాడు వ్యాసుడు. సత్యవతి పుత్రశోకంతో జరిగిందంతా వివరించింది. తల్లిని ఓదార్చి వ్యాసుడు అంబికకు ధృతరాష్ట్రుని, అంబాలికకు పాండురాజును, అంబిక పంపిన దాసీ స్త్రీకి విదురుడిని పుత్రులుగా ప్రసాదించాడు. ధృతరాష్ట్రుడికి నూరుగురు కుమారులు, పాండురాజుకు అయిదుగురు పుత్రులు పుట్టారు.

సత్యవతికి వృద్ధాప్యం రావటం వలన వ్యాసుడు తనతో తీసుకెళ్తాననగా అంబిక, అంబాలిక కూడా అత్తగారి వెంటనడిచారు. ఒక ప్రశాంత వనంలో ఒక ఆశ్రమం నెలకొల్పి ఆ ముగ్గురు స్త్రీలను అక్కడ నివసించమని చెప్పి తాను తపస్సు చేసుకోవటానికి వెళ్ళిపోయాడు. తరువాతి కాలంలో కౌరవుల వలన పాండవులకు జరుగుతున్న అన్యాయాలు తెలిసి వ్యాసుడు హస్తినకు వచ్చి పాండవులతో వైరం తగదని, వారికి అన్యాయం జరిగితే పెనుముప్పు తప్పదని, భగవానుడైన శ్రీకృష్ణపరమాత్మ పాండవులపక్షాన నిలుస్తాడని హెచ్చరించాడు. వ్యాసుడు తరుచుగా పాండవులను కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకునేవాడు.

కురుక్షేత్ర సంగ్రామం తరువాత గాంధారీ, ధృతరాష్ట్రులకు మరణించిన వారి పుత్రులను, కుంతీదేవికి కర్ణుని చూడాలని అభిలాష వ్యక్తం చేయగా వ్యాసుడు తన తపశ్శక్తితో వారిని చూపించాడు. ద్వాపర యుగానికి ప్రత్యక్ష సాక్షి కనుక మహాభారతాన్ని చెప్పమని బ్రహ్మకోరగా వ్యాసుడు చెప్తుంటే భారతాన్ని విఘ్నేశ్వరుడు వ్రాశాడు.

## గురుపూర్ణిమ

డాక్టర్ రాముడుగు వెంకటేశ్వరశర్మ

సీ॥ ధర నిరంతర శుభంకరముగాగ విభక్తి
        చతురాగమంబు శీర్షముగ వరల.
    వరణీయ హితధర్మకరణీయగతి గూర్చు
        అల పురాణాళి దేహముగ వెలయ
    సదసన్మనశ్చిత్ర సరసోక్తమౌ ఆ "జ
        యమె" మేను నిల్పు వ్యాసముగ వెలుగ
    భక్తి వైరాగ్య నిర్భరమనోహర భాగ
        వతమె దెందంపుటా కృతి గనంగ
    నెసగు నా బాదరాయణఋషి వరుండె
    జనన మొందిన దీ పుణ్యదినము గాదె !
    భారతీయ విజ్ఞాన సరస్వ సుకృతి
    జగతి నుదయించె గురుపూర్ణిమగ - నిజంబు ॥

# శ్రీ దక్షిణామూర్తి స్తోత్రము

ఆచార్య శ్రీ అప్పల సోమేశ్వరశర్మ, విశాఖ

శ్లో॥ యస్యైవ స్ఫురణం సదాత్మకమసత్కల్పార్థగం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యో బోధయత్యాశ్రితాన్ ।
యత్సాక్షాత్కరణాద్భవేన్న పునరావృత్తిర్భవాంభోనిధౌ
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

**భావము :** సత్యమైన ఎవని యొక్క స్ఫూర్తియే (జ్ఞానమే) వాస్తవంగా లేని (అసత్యమైన) వివిధ వస్తువుల రూపంలో కలుగుచుండునో, 'తత్త్వమసి' అనే మహావాక్యంతో బ్రహ్మజ్ఞానులకు ఎవడు తత్త్వాన్ని ఉపదేశించునో, ఎవని సాక్షాత్కారం వల్ల పునర్జన్మ కలుగదో, అట్టి గురుమూర్తి అయిన శ్రీ దక్షిణామూర్తికి నమస్కారము.

వివరణ : "బ్రహ్మ సత్యం జగన్మిథ్య" అనే ఉపనిషద్వచనం ఉంది. బ్రహ్మమనగా మహాచైతన్యం (మహాశక్తి) అదొక్కటే పరమార్థ సత్యం. అదే నామరూపాత్మకమైన జగత్తుగా భాసిస్తోంది. జగత్తు పారమార్థిక సత్యం కాదు. వ్యావహారిక సత్యం మాత్రమే. అయినపుడు 'బ్రహ్మము' తప్ప వేరేది ఏదీ లేదు. ఆ బ్రహ్మమే లేని విషయాల్ని మనకు అందిస్తున్నది. దీన్నే "తదాకారాకారిత జ్ఞానమ్" అని సాంకేతికంగా అంటారు. (ఆ బ్రహ్మమే ఒక ఆకారము ఒక పేరు గల లౌకిక వస్తువుగా లేక మానసిక వస్తువుగా తోచుచుండును) ఈ పద్ధతికి హేతువేమిటో ఎవరికో తెలియదు. దానినే 'మాయ', 'అవిద్య', 'అజ్ఞానం' అంటూ ఉంటారు.

ఒక చిత్రం - ఈ అంశాన్నే 'తత్త్వమసి' అనే మహావాక్యంతో బ్రహ్మమే ఘోషిస్తుంది. ఈ అనుభవం కలగడమే సాక్ష్కాత్కారమనబడును. ఇది కలిగినపుడు జననమరణాల ప్రసక్తియే ఉండదు. నిత్యసత్యమైన వస్తువునకు చావు, పుట్టుక లేమిటి ?

**తత్త్వమసి :** ఈ మహావాక్యం ఛాందోగ్యోపనిషత్‌లో ఉన్నది. శ్వేతకేతూపాఖ్యాన విషయమిదే. ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువునకు తత్త్వాన్ని ఉపదేశిస్తూ ఈ వాక్యాన్ని 9 సార్లు చెప్పాడు. 'తత్' అది, అనగా బ్రహ్మము, 'త్వమ్' అనగా నీవు, 'అసి' అయి ఉన్నావు - అనగా 'బ్రహ్మమే నీవు'. తొమ్మిది రకాలైన దృష్టాంతాలను చూపి దార్ఢ్యము కోసము ఈ విధంగా చెప్పాడు. చివరకు శ్వేతకేతువునకు జ్ఞానోదయమైంది.

జనన మరణాలు వ్యవహారంలో కేవలం ఉపాధికే. 'జీవము' అన్నమాట కూడా 'అవిద్య' అన్న అంశం ఉన్నంతవరకే. ఆకాశానికి జననమరణాలుంటాయా ! సంభవమా ? అట్టిదే ఆత్మ అనుకొనవచ్చును. (ఆత్మకు దగ్గరి దష్టాంతం ఇదొక్కటే) అయితే, సృష్టి క్రమం వేదాలలోను ఇతిహాస పురాణాదులలోను భిన్న భిన్నంగాను, అకాండ తాండవంగాను (కారణం లేని గంతులు) వర్ణించబడి ఉంది. అది కేవలం వ్యావహారికం. అద్వైత సమ్మతం కాదు (లేదా 'ఛాత్ర బోధ కొరకు' - 'శిష్యులకు చెప్పడానికి' అనవచ్చు).

శ్లో॥ నానా ఛిద్ర ఘటోదరస్థిత మహాదీపప్రభా భాస్వరం
జ్ఞానం యస్యతు చక్షురాది కరణ ద్వారా బహిస్స్పందతే ।
జానామీతి తమేవ భాంతమను భాత్యే తత్సమస్తం జగత్
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే॥

**భావము :** ఒక దీపాన్ని ఎన్నో రంధ్రాలు గల కుండతో మూసి వేసినపుడు దీపకాంతి అంతా ఆ కన్నాల ద్వారా కణికల వలె పైకి కనిపించును. ఆ విధంగానే అఖండజ్యోతి శరీరధారులలో ఎల్లపుడూ ఉండును. శరీరానికి ఆయా ఇంద్రియాలనే కన్నాలు ప్రకృతి సిద్ధము. వాటి ద్వారానే సకల జ్ఞానము కలుగును. అనగా, అది మహాచైతన్యము యొక్క కాంతిరేఖలు అని అర్థము. "నేను తెలుసుకొనుచున్నాను" అనే జ్ఞానం కూడా అనువ్యవసాయంగా జరుగుచున్నది. (అనగా, తానే తనను తెలియును) ఇట్టి జ్ఞానాన్ని కలుగజేయు గురువైన దక్షిణామూర్తికి నమస్కారము.

**వివరణ :** ఇచట ఇయ్యబడిన ఘట - దీప దృష్టాంతం చాలా నమంజనముగా ఉంది. ఒకే వస్తువు వివిధంగా భాసించుట ఇచట వ్యంగ్యం. శరీరానికి తొమ్మిది రంధ్రాలున్నాయి - వాటి ద్వారానే శబ్ద, స్పర్శ రూపాది విషయాలన్నీ ప్రకాశిస్తున్నవి. లోపల నున్న మహాదీపం - చైతన్యం. కాగా, చైతన్యమంతా ఒక్కటే (ఆయా ఆకారాలతో ఉండే విషయాలన్నీ చైతన్యమే) "అనువ్యవసాయం" - ఒక వస్తువును తెలుసుకొన్న తరువాత "నేను తెలుసుకున్నాను" అని భాసించుట అనువ్యవసాయ మనబడును. ఇంకొక చిత్రము - శరీరమునకు కూడా "ఘట"మని వ్యవహరించుట సామాన్యంగా ఉన్నది. అంతయూ జ్ఞానమే; జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయ రూపమైన విభాగమంతయు వ్యావహారికము లేక భ్రాంతి అనవచ్చును. ఇటువంటి విభాగాన్ని "త్రిపుటి" అందురు. దీనికి మూలము అధిష్ఠానమగు చైతన్యమే. జగత్తంతా బ్రహ్మవివర్తమే కాని వేరొకటి కాదని సారాంశం.

✣✣✣

# గురుపూజ - గురువు లక్షణాలు

డాక్టర్ కసిరెడ్డి వెంకరెడ్డి, హైదరాబాద్

ఆషాఢపౌర్ణమి నాడు దేశమంతటా గురుపూర్ణిమ నిర్వహించే సంప్రదాయం అనాదిగా కొనసాగుతుంది. వేద వ్యాసులీ పూర్ణిమనాడు జన్మించిన కారణంగా ఈ పూర్ణిమ కెంతో ప్రాముఖ్యం వచ్చింది. ఈ రోజే వ్యాసజయంతి, గురుపూజ నిర్వహించుకొనే సంప్రదాయం ఏర్పడింది.

**"ఓం గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।**
**గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః॥**

గురువు బ్రహ్మ, గురువు విష్ణువు; గురువు మహేశ్వరులు; గురువు సాక్షాత్తుగా పరబ్రహ్మ; అలాంటి గురువుకు నమస్కారం.

నీలో మంచిని సృష్టించే గురువు బ్రహ్మ. నీలో మంచిని నిలిపే గురువు విష్ణువు. నీలోని చెడును నాశనం చేసే గురువు మహేశ్వరుడు. ఈ త్రిమూర్త్యాత్మకమైన గురువే సాక్షాత్తుగా పరబ్రహ్మ.

గురువును గురించి అనేక గ్రంథాలు లక్షణాలనిచ్చినై. అలాంటి వాటిలో కొన్ని శ్లోకాలను పరిశీలిద్దాం.

**"అవిద్యా హృదయగ్రంథి - బంధమోక్షోభ వేద్యతః।**
**తమేవ గురురిత్యాహు - ర్గురు శబ్దార్థవేదినః॥**

అవిద్యా హృదయ గ్రంథి తొలగించే వారు; బంధ మోక్షం కలిగించే వారే గురువు. ఆ మహానుభావుడే గురువని గురు శబ్దార్థం తెలిసిన పెద్దలు చెబుతున్నారు.

**"గు శబ్దస్త్వంధకారః స్యాత్ - రుశబ్ద స్తన్నిరోధకః**
**అంధకార నిరోధిత్వా - ద్గురురిత్యభిధీయతే ॥**

'గు' అను శబ్దానికి అంధకారమని అర్థం. 'రు' శబ్దం దానిని నాశనం చేసే తేజస్సు. అంధకారమనే అజ్ఞానాన్ని జ్ఞానమనే వెలుగు ద్వారా నిరోధించే వారే గురువు. ఈ విషయాన్ని ఈ క్రింది శ్లోకం ఇంకా బాగా వివరిస్తున్నది.

**"గుకార శ్చాంధ కారోహి - రుకార స్తేజ ఉచ్యతే ।**
**అజ్ఞాన గ్రాసకం బ్రహ్మ - గురురేవ న సంశయః ॥**

అజ్ఞానమనే తమస్సును మ్రింగువారే గురువు. వారే బ్రహ్మం - ఇందులో సంశయం లేదు. నామరూప గుణాతీత బ్రహ్మమును తెలుపు వారే గురువని ఈ క్రింది శ్లోకతాత్పర్యం.

**"గుకారశ్చ గుణాతీతో - రూపాతీతో రుకారకః ।**
**గుణరూప విహీనత్వా - ద్గురురిత్యభి ధీయతే ॥**

గుకారం గుణాతీతం; రుకారం రూపాతీతం; నామరూప గుణరహిత బ్రహ్మన్ని తెలుపువారే గురువని అంటారు. మరో శ్లోకం చూడండి.

**"చాతుర్యవాన్ వివేకీచ - అధ్యాత్మ జ్ఞానవాన్ శుచిః।**
**మానసం నిర్మలం యస్య - గురుత్వం తస్య శోభతే॥**

చాతుర్యముండాలి. వివేకముండాలి. ఆధ్యాత్మ జ్ఞాన సంపన్నుడు కావాలి. బహిరంతర శుద్ధి ఉండాలి. మనస్సు పవిత్రంగా ఉండాలి. అలాంటి వారికే గురుశబ్దం శోభిస్తుంది.

**"గురవే నిర్మలాశ్శాంతాః సాధనో మితభాషిణః।**
**కామక్రోధ వినిర్ముక్తాః సదాచారా జితేంద్రియాః॥**

గురువు నిర్మలునిగా, శాంతునిగా, సాధన చతుష్టయ సంపత్తి గలవానిగా, మితభాషిగా ఉండాలి. కామక్రోధాలను వదిలిన వారై ఉండాలి సదాచార ప్రవర్తకులై ఉండాలి. జితేంద్రియులై ఉండాలి. గురువు విషయంలో ఈ క్రింది శ్లోకార్థాన్ని గుర్తించండి.

**"ఆచార్యో వేద సంపన్నో - విష్ణు భక్తో విమత్సరః।**
**యోగజ్ఞో యోగనిష్ఠశ్చ - సదాయోగాత్మక శ్శుచిః॥**

వేద సంపన్నుడై, పరమభక్తుడై, విమత్సరుడై, యోగజ్ఞుడై, యోగనిష్ఠుడై, సదాయోగాత్మ స్వరూపుడై, బహిరంతరాలలో శుచిగలవాడై ఆచార్యులుండాలి.

మంచి గురువు దొరకడం శిష్యుల అదృష్టం. మంచి శిష్యుడు దొరకడం కూడా గురువు అదృష్టమే. గురుశిష్యులకు గుర్తుగా రామకృష్ణ వివేకానందులనే చెప్పుకోవాలి.

"అయితే లోకంలో బోధగురువులకు మారుగా అప్పుడప్పుడు బాధగురువులూ తటస్థ పడతారు. వారు శిష్య హృత్తాపహారకులు కారు, శిష్య విత్తాపహారకులవుతారని అంటారు. సద్గురు మహర్షి మలయాళస్వాముల వారు.

**"గురవో బహవస్సంతి - శిష్యవిత్తాపహారకాః।**
**తమేకం దుర్లభం మన్యే - శిష్యహృత్తాపకారకమ్॥**

శిష్యుల ధనాన్ని అపహరించే గురుస్వాములెందరో ఉన్నారు. శిష్యుల హృదయతాపం పోగొట్టే గురువులు దొరకడం కష్టం.

మంచి శిష్యుణ్ణి గురువు అన్వేషించిన విధంగానే మంచి గురువును శిష్యుడు అన్వేషించాల్సి వుంది. గురుపూజ సందర్భంగా అందరూ తమ తమ గురువులు చెప్పిన బాటలో నడవాలని దీక్ష తీసుకోవడమే నేడు గురుపూజగా భావించాలి.

# వ్యాసపూర్ణిమ

— శ్రీ ఆంధ్ర శేషగిరిరావు, విశాఖ

ఆషాడ శుద్ధపూర్ణిమకు వ్యాసపూర్ణిమ అని పేరు.

ఈ పర్వము యతులకు అతిముఖ్యమైనది. వా రీనాడు మహాభారతము మున్నగు సంహితా గ్రంధాలకు రచయిత అయిన వ్యాసుని పూజిస్తారు. వ్యాసపూర్ణిమ పర్వాన్ని ఆదిలో శంకరాచార్యులు ఏర్పాటు చేశారని చెబుతారు.

ఈ పూజావిధానం గమనింపతగింది.

కొత్త అంగవస్త్రం భూమి మీద పరుస్తారు. దాని మీద బియ్యం పోస్తారు. ఆ బియ్యం మీద నిమ్మకాయలు ఉంచుతారు. ఇది శంకరులు, అతని నలుగురు శిష్యులు వచ్చి దానిని అందుకొంటారని నమ్మకం. పూజ అయ్యాక ఆ బియ్యం తలా ఒక పిడికెడు తీసుకువెళ్లి తమ తమ ఇళ్లల్లో బియ్యంలో కలుపుకుంటారు.

బియ్యం, కొత్తవస్త్రం లక్ష్మీ చిహ్నం. శుభసందర్భాల్లో బియ్యం యధాశక్తిని రాసి పోసి లక్ష్మిని ఆహ్వానించటం హిందూ గృహాల్లో పరిపాటి. నిమ్మపళ్లు కానుకగా ఇచ్చుపళ్లు. అవి కార్యసిద్ధి సూచిస్తాయి. బియ్యము, నిమ్మపళ్లు ఉంచడం లక్ష్మీకటాక్షం కోసం.

దక్షిణాదిన కుంభకోణంలో, శృంగేరిలో శంకర పీఠములు ఉన్నాయి. వ్యాసపూర్ణిమ అక్కడ అత్యంత వైభవంతో జరుపబడుతుంది. ఆ పర్వ సందర్భంలో అక్కడికి వేల కొలది తైర్థికులు వస్తారు.

వ్యాసపూర్ణిమ గురుపూజా దినమని పాంచజన్యము పత్రిక (28-7-34) ఇట్లా అంటూ ఉంది.

'ఇందు వ్యాసపదము గురువరము, నాడు లోక మంతయు తమ తమ గురువు నారాధించుకొని తరింప వలయునని శాస్త్రాదేశము. స్వస్వరూపాను సంధానమున కన్న భిన్నమగు అన్యారాధనతగదని, యతిశేఖరులనే యీనాడాచార్య పీఠార్చనల నాచరింపవలసినదిగా శాస్త్రమాదేశించి ఉన్నది. గుర్వాదేశనము విశేష ప్రయోజనకారియును అయి, అనుల్లంఘ్యమనియు చెప్పుటకు మనకు రెండు ప్రబల ప్రమాణములు కలవు. **'యస్యదేవే పరాభక్తిః యధా దేవేయాతధా గురౌ'** అని శేతాశ్వతరోపనిషత్తు నందు లిఖితమైంది. ఇందు వేదమాత, ఈశ్వరారాధనతోటి తుల్య గౌరవమును, సమాన ప్రాధాన్యమును గురుపూజనమునకు నిచ్చుచున్నది. కాని స్మృతికర్తలింకొక మెట్టెక్కుడధిష్ఠింప జేయచూచినారు. గురువును **'దైవేఋష్టేగురుస్త్రాతా, గురౌఋష్టేనకశ్చన'** యని దైవాను గ్రహమునకు గుర్వనుగ్రహము యత్యంతా నివార్యమగునట్టిది. కనుక సాధనమపేక్షించిగాని దాని యెడ నజ్ఞతను జూపిగాని సిద్ధిని పోందజూచుట అవివేకమునూ హస్యాస్పదమునూ నగునని వారి యుద్దేశ్యము. వ్యాసపూర్ణిమ యనుదాని యందలి వ్యాసపద మాధికారిక పదపరముగాని వ్యక్తిపరము కాదనునదొకటియు, అనాడొనర్చు గురు పీఠార్చనలలో నిప్పుడు దేశమందునున్న యతికర్తృక పూజ మాత్రము ఉప లక్షణములు మాత్రమేననియు, ఆనాడు సర్వులు సర్వవిధముల తమ తమ గుర్వర్చన జేసి గురుభక్తిని వెల్లడించి పెంపొందింపజేసికొనుట విధియనయు మా విశ్వాసము.'

వ్యాసపూర్ణిమ యందలి వ్యాసపదము వ్యక్తిపదము కాదనుచున్నారు. ఈ విషయం కొంత విచారింప వలసివుంది.

ఎంతో మంది ఋషులు ఉండగా ఒక్కవ్యాసుని పేరనే ఈ పూజ జరుపుటకు ఏమిటి హేతువు! ఈ పూజలో ప్రత్యేక పూజలు అందే ఆదిశంకరులు వ్యాసభగవానుని అపరావతార మని చెబుతారు. కాగా ఇది వ్యాసపూజకు ఉద్దిష్టమైనది. వ్యాసపూజ అనగా అదిశంకరుల పూజ అనగా వ్యాసపూజ. సన్యాసులందరూ ఆదిశంకరులు తమ గురువుగా ఎంచుకుంటారు. కాగా నేడు సన్యాసులందరూ వ్యాసుని రూపంలో తమ గురువును కొలుస్తున్నారన్నమాట. అందుచేత ఇది వ్యాసపూజా దినమైంది.

శ్రీ శంకరాచార్యుల వారి జయంతికి వేరే ఒక దినము ఉద్దిష్టమై ఉంది. కాగా దీనిని గురుపూజా దినముగానే భావింపవలసివుంది.

**మహాషాఢ- వ్యాసపూజ**

ఈ దినమందు అష్టాదశ పురాణ నిర్మాత అయిన వ్యాసమహర్షిని పూజించాలి.

**శ్లో॥ శంకరం శంకరాచార్యం గోవిందం బాదరాయణం**
**సూత్రభాష్యకృతౌవందే భగవంతౌ పునఃపునః**

అని పూజించిన బ్రహ్మత్వసిద్ధి కలుగునని చెబుతారు.

వైష్ణవ పూరాణమును ఆషాడ పూర్ణిమనాడు దానమిస్తే విష్ణు లోకము కలుగును. వ్యాసభగవానుడు సకల కళానిధి, సకలశాస్త్రవేత్త. సోమకుడు అనే రాక్షసుడు వేదాలను ఎత్తుకు పోయినపుడు అవి ఒకదానిలో ఒకటి కలిసి పోయాయి. కొంతకాలానికి శ్రీ మహవిష్ణువే వ్యాసావతారం ఎత్తి ఆ వేదాలను విభజించి చక్కపఱచాడు. చిక్కుపడిన వేదములను విభాగించిన విద్యావేత్తయేకాక అతడు శస్త్ర చికిత్సావేది కూడ. గాంధారి ఈసుపూని దిగజార్చుకొన్న గర్భస్థ పిండాన్ని పరిరక్షించి ఆ పిండాన్ని పరిరక్షించి ఆ పిండంలో నూటఒక్క శిశువులు ఉండడం గుర్తించి ఆ విధముగా ఆ పిండాన్ని నేర్పుతో విభాగించి నేతి

కుండలో నిక్షిప్త మొనర్చి పోషించేటట్లు చేసిన వైద్యవరుడు, వైద్యవిద్యానిధి, మేధానిధి, **ఆత్మవిద్యానిధి** అయిన వ్యాస భగవానుని పూజించడానికి **ఉద్దిష్టమైన**పర్వమిది.

ఆషాఢ **శుద్ధ**పూర్ణిమ రుద్ర సావర్ణి మన్వంతరాది దినము. రుద్ర సావర్ణి పన్నెండో మనువు. అతడు రుద్రపుత్రుడు ఈ మన్వంతరంలో ఋతధాముడు ఇంద్రుడు, తపస్వి, సుతపస్వి మున్నగువారు సప్తర్షులు.

**శివశయనోత్సవం**

ఆషాఢ శుద్ధ **పూర్ణమ** శివశయన వ్రతం చేయాలని, వ్రతగ్రంధాలు చెబుతున్నాయి. ఈనాటి వివరణలో స్మృతి కౌస్తుభము శివ శయనోత్సవం, 'శివే పవిత్రారోపణమ్' అని పేర్కొంటూ ఉంది. ఈ ఉత్సవాన్ని శైవులు ఎక్కువగా చేస్తారు. పాపాలను తన జడలతో కలిపి కట్టి వేసి పెద్దపులి చర్మాన్ని శయ్యగా ఏర్పఱచుకొని శివుడు ఆషాఢ శుద్ధ పూర్ణిమ మొదలు నాలుగు మాసాలపాటు నిద్రపోతాడు. ఆషాఢ శుక్ల ఏకాదశి నుంచి విష్ణుశయన వ్రతం చేసేవిధంగానే ఆషాఢ శుద్ధ పూర్ణిమ మొదలు శివశయన వ్రతం చేస్తారు.

## స్వామీజీ అమెరికా పర్యటన

శ్రీ పి.నాగేంద్రరాయ్

అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆహ్వానం మీద ఈసారి పర్యటన **ఏర్పాటైంది**. **జులై**, 3, 4, 5 తేదీలలో ఆ సంస్థ సమావేశాలు. **అయితే భక్తుల** అభ్యర్థన మీద స్వామీజీ జూన్ 9వ **తేదీన బయలుదేరి** 10వ తేదీ న్యూజెర్సీ చేరారు. అక్కడ నుండి పర్యటన ప్రారంభమైంది.

పాదపూజలు, గృహగోష్ఠులు, బహిరంగ సమావేశాలు అందరూ తెలుగువారే ఉన్నచోట్ల తెలుగులో కార్యక్రమాలు, ఇతర భాషీయులు ఉన్నచోట్ల అంగ్లంలో అనుగ్రహాభాషణలు జరిగినవి.

**ఫిలడెల్ఫియా :** ఇక్కడ కార్యక్రమాలన్నీ తమిళభక్తుడు అనంతకృష్ణ నిర్వహణలో జరిగినవి. స్వామీ దయానంద ఆశ్రమంలో, దక్షిణామూర్తిఆలయంలో - స్వామీ విదితాత్మానంద మొదలగు వారితో గోష్ఠి **పూజలు** ప్రసంగములు జరిగినవి. (జూన్ 11)

**వాషింగ్టన్ డి.సి.:** ఇక్కడ మురుగన్ గుడిలో అనుగ్రహ భాషణ జరిగింది. (జూన్ 13)

**హారిస్ బర్గ్ :** హిందూదేవాలయంలో - మంత్రసాధనపై ఉపన్యాసము. (జూన్ 15)

**న్యూయార్కు :** గిరీశమందిరంలో - శివతత్వంపై ప్రసంగం. శ్రీ భండారు **గిరిబాబు** - నిర్వహణ (జూన్ - 15)

**బోస్టన్ :** శ్రీ పుచ్చాశేష ఆధ్వర్యంలో కార్యక్రమాలు చి॥తేజస్వి పనిచేస్తున్న మహాలక్ష్మి ఆలయంలో అనుగ్రహాభాషణ. (జూన్ 18)

కాళీమందిరంలో శ్రీమతి విజయశ్రీ నిర్వహణలో అభిషేకము, పూజ - **జూన్ 19.**

**అట్లాంటా :** శ్రీ గుడె రమేష్ నిర్వహణలో కార్యక్రమాలు సాయిబాబా గుడిలో. సాయితత్వ గ్రంథావిష్కరణ (జూన్ 20) హిందూ దేవాలయంలో అనుగ్రహాభాషణ (జూన్ 21)

**శాన్‌ఫ్రాన్సిస్కో :** శ్రీ శివకుమార్ - శ్రీశ్రీనివాసాచారి, శాయి, రవికుమార్ నిర్వహణలో సత్యనారాయణ స్వామి గుడిలో అనుగ్రహాభాషణ జూన్ (23).

**లివర్‌మూర్ :** వేంకటేశ్వరస్వామి గుడిలో అమెరికాలో హిందూదేవతలు అనే విషయంపై ఉపన్యాసం.

**సిలికాన్ వేలీ :** అంతర్జాతీయ కూచిపూడి నాట్య ప్రదర్శనలు బృహత్ సమ్మేళనంలో ఆశీః ప్రసంగం (జూన్ 22)

**సియాటిల్ :** శ్రీ పోచిరాజు శ్రీనివాస్ నిర్వహణలో కార్యక్రమాలు ఇస్కాన్ రాధాకృష్ణమందిరంలో ఉపన్యాసాలు (జూన్ 24, 25)

**డాలస్ :** శ్రీ వి.వి.రామన్ నిర్వహణలో కార్యక్రమాలు జూన్ 27, 28తేదీలలో హిందూ దేవాలయంలో రాధాకృష్ణ తత్వంపై ఉపన్యాసాలు. ఇక్కడ రేడియో స్టేషన్‌వారు స్వామి వారితో ఇంటర్వ్యూ జరిపి బ్రాడ్‌కాస్ట్ చేశారు.

**న్యూజెర్సీ :** శ్రీ అప్పాజోస్యుల సత్యనారాయణ నిర్వహణలో డాక్టర్ శ్రీ నోరి దత్తాత్రేయులు ఇతరుల సహకారంతో భాగవతోపన్యాసాలు - సాయిమందిరంలో జూన్ 29 నుండి **జులై** 3 వరకు, జులై 4, 5 తేదీలలో ఆటా మహాసభలలో అనుగ్రహ భాషణము.

**పూజలు, యజ్ఞములు :** ప్రతి ఊరిలో మౌనస్వామి పూజలు పీఠసంప్రదాయం ప్రకారం జరిగినవి. అట్లాంటా, ఫిలిడల్ఫియా, బోస్టన్, డాలస్ నగరాలలో హోమములు నిర్వహించ బడినవి. ప్రతిచోట భక్తుల సమస్యలకు పరిష్కారాలు, మంత్రోపదేశాలు చేయబడినవి. కొందరు స్వామీజీ వల్ల తమకు కలిగిన దివ్యానుభవాలను, దర్శనాలను తెలియజేశారు.

# వేదవ్యాసుని జీవిత సందేశం, సమదర్శనం

- డాక్టర్ మోపిదేవి కృష్ణస్వామి, అమలాపురం

జీవన్ముక్తుడై జన్మించిన సిద్ధపురుషుడినుంచి పరమధర్మమే స్వధర్మంగా ఎలా వ్యక్తం అవుతూ ఉంటుందో వ్యాసభగవానుడి జీవిత గ్రాథలో మనకు దర్శనం ఇస్తుంది. లోకహితార్థమై విష్ణ్వంశతో రూపు. కట్టుకొని అవతరించినాడు వేదవ్యాసుడు. పాండవులప్రయాణం ఎక్కడకు సాగుతోందో అక్కడనుంచి దిగివచ్చినవాడు ఈయన. కాబట్టే వారి ప్రయాణానికి తొలినుంచి తుదివరకూ కృష్ణునితో బాటు మార్గదర్శిగా నిలిచాడు.

యోగి అయినవాడు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఘర్షణకు తావులేకుండా కర్తవ్యాన్ని బాధ్యతాయుతమైన లీలగా ఎలా నిర్వహిస్తాడో వ్యాసుడి జీవితంలో మనం దర్శించవచ్చు. పరాశరసత్యవతు లకు సద్యోగర్భాన జన్మించినవాడు వేద వ్యాసుడు. తండ్రి లోకహితార్థమై తనకు జన్మను ఇచ్చాడని ఆయనకు తెలును. ఆతండ్రి సంకల్పాన్ని అనుసరించి లోకహితార్థమై తపస్సుచేయడానికై కృష్ణ ద్వీపానికి తరలివెడుతూ తల్లికి నమస్కరించి'మీరు ఎప్పుడు పని కలిగి స్మరిస్తే అప్పుడు మీదగ్గర ఉంటాను అని వినమ్రుడై చెప్పి ఆమె అనుజ్ఞ తీసుకొంటాడు.

కురువంశ నిర్వంశం అయిపోతున్న తరుణంలో వ్యాసుడు తల్లి సంకల్పాన్ని అనుసరించి అంబికా అంబాలికలకు సంతతిని అనుగ్రహిస్తాడు. వ్యాసుడు ఘర్షణకు తావు లేకుండా యోగి అయినవాడు కర్తవ్యనిర్వహణ నిస్సంగుడై ఎలా నడుపుతాడో చూపించాడు.

లోకహితార్థమై ఒకవంక తపస్సూ, మరొకవంక శిష్యులకు శిక్షణా, వేరొకవంక వేదవిభాగాది వ్యాసంగమూ, ఇంకొకవంక ఆశ్రితరక్షణా నిర్వహిస్తూనే తనకు జన్మను ఇచ్చిన తల్లిని ఆవశ్యకత ఏర్పడినపుడల్లా దర్శిస్తూ, తగినరీతిని సేవిస్తూ వచ్చాడు వ్యాసుడు. కొడుకుగా తల్లిపట్ల తనకు గల బాధ్యతను ప్రేమతో నిస్సంగుడై పరిపూర్ణంగా నిర్వహించాడు వ్యాసుడు. తండ్రి సంకల్పాన్ని అనుసరించి పురాణేతిహాసాది వాఙ్మయాన్ని సృష్టించడంద్వారా వేదాన్ని ఉపబృంహణం చేసి తండ్రి అడుగుజాడల్లో తుదిముట్ట నడిచినవాడు అయ్యాడు. తల్లిదండ్రులకు సంబంధించిన సన్నివేశాల్లో వ్యాసుడి ప్రవర్తనను చూసినపుడు వైరాగ్యం అంటే బాధ్యతలను వదలి పేట్టడంకాదు, వ్యామోహపడకుండా బాధ్యతలను పరిపోర్ణంగా నిర్వహించడం అన్న సందేశం మనకు అందుతుంది.

వ్యాసుడు తాను బద్ధజీవి కాకపోవచ్చు. కానీ బద్ధ జీవుల మనస్సులు ఎలావనిచేస్తాయో అతడికి బాగా తెలును, ధృతరాష్ట్రుడు కొడుకులపై వ్యామోహపడుతున్నప్పుడు ఆ మోహాన్ని కూడనిది అని నిందించక బద్ధజీవికి అది సహజం అని గుర్తించి ధృతరాష్ట్రుడికి దర్శనం ఇచ్చి ఇలా అన్నాడు. నీ బిడ్డలపై నీకు గల మమకారం దోషం అని నేను అనడంలేదు. అది సహజమే. దాన్ని పాండవులవరకూ కూడా పెంచుకో. నేను నిన్నూ పాండు రాజానూ విదురుణ్ణీ ఒకేభావంతో చూసినట్టు నీవు కౌరవుల్నీ పాండవుల్నీ ఒకే దృష్టితూ చూడాలి. ఈ సన్ని వేశంలో సామాన్యస్థితికి దిగివచ్చి సంభాషించిన వ్యాసుడు యోగి అయినవాడు తోడి జీవులతో ఎలా ప్రవర్తించాలో వారి మమకార ఉద్వేగాలను ఎలా అర్థంచేసుకోవాలో చూపిస్తున్నాడు. వ్యాసుడు ఈ సన్నివేశం ద్వారా యోగి సారం ఎరిగినవాడుగానే కాక, సంసారం ఎరిగినవాడుగాకూడ ఉండగలగాలి, ఉచితమైన తీరులో ప్రవర్తించాలి అని ఉపదేశంచేశాడు.

లాక్షాగృహంనుంచి బయటపడి హిడింబాసురవధ పూర్తి చేసుకొని ఆపైన కర్తవ్యం ఏమిటో నిర్ణయంకాక నిలిచిన కుంతీ పాండవులకు వ్యాసుడు సాక్షాత్కరించి కౌరవులు తమ దుష్ట ప్రవృత్తికి తగినశిక్ష అనుభవించగలరనిచెప్పి పాండవులకు మళ్ళీ కనబడతానంటాడు.

బకాసురవధ పూర్తిచేసుకొని ద్రుపదుడిపురానికి బయల్దేరిన పాండవులకు మార్గమధ్యంలో దర్శనంఇచ్చి ద్రౌపది పూర్వజన్మ వృతాంతాన్ని సంక్షిప్తంగాచెప్పి, 'వెళ్ళిరండి, శుభం అవుతుంది' అంటాడు. 'ద్రౌపదిని మేం అయిదుగురం చేసుకుంటా'మన్న ధర్మజుడి నిర్ణయానికి ద్రుపదుడు అదిరిపడి తటపటాయించినపుడు వ్యాసుడు మళ్ళీ సాక్షాత్కరించి ద్రుపదుణ్ణి సమాధానపరుస్తాడు. కల్యాణాన్ని జరిపిస్తాడు. శ్రీ కృష్ణుడు పాండవులకు పరిచయం అయ్యేటంతవరకూ కంటికిరెప్పలా వారిని కాపాడుకొంటూ వచ్చిన వ్యాసుడు ఆపైన కృష్ణుడితోకలిసి వారికి తన అండదండల్ని అందిచాడు. పాండవులు లాక్షాగృహం నుంచి బయటపడినప్పటినుంచీ మహాప్రస్థానానికి బయలు దేరేటంతవరకూ వారికి వ్యాసుడి వెలుగు పథనిర్దేశం చేస్తూనే ఉంది.

యుద్ధం ముగియగానే కుమిలిపోతున్న ధృతరాష్ట్రుణ్ణి వచ్చి ఓదారుస్తాడు వ్యాసుడు. ధర్మజాదుల సహృదయాన్ని వివరించి వారితో కలిసి మనమంటాడు.

ఆపైన ఆశ్రమవాసానికి తరలి వెళ్ళబోతున్న ధృతరాష్టుణ్ణి తన ఆశ్శీస్సులతో సాగనంపుతాడు. ఆశ్రమవాసంలోఉండగా మరొక సారి వారికి సాక్షాత్కరిస్తాడు. పాండవులు కూడా అప్పటికే అక్కడ చేరి ఉంటారు. వారందరి కోరిక ప్రకారం చనిపోయిన బంధువుల నందర్నీ సాక్షాత్కరింపజేస్తాడు వ్యాసుడు.

ధృతరాష్ట్రుడు తన బిడ్డల్ని చూడగలికానన్న తృప్తిని పొందుతాడు. అతడికిగల చివరికోరికను తానే గమనించి తీర్చేటందుకే వ్యాసుడు ఈ సన్నివేశంలో సాక్షాత్కరించింది.

మొత్తంమీద ధృతరాష్ట్రుడు బద్ధజీవితంనుంచి ముక్తిని పొందేవరకూ వెన్నంటి ఉన్నాడు వ్యాసుడు.

ధృతరాష్ట్రుడు బిడ్డలు అందర్నీ కోలుపోయినప్పుడు కూడా, తగినశిక్ష అనుభవించాడులే అని ధృతరాష్ట్రుణ్ణి వదిలిపెట్టలేదు వ్యాసుడు. అతడుపడే బాధ శిక్షగా కాక శిక్షణగా మలచి క్రమంగా ధృతరాష్ట్రుణ్ణి వైరాగ్యసంపన్నుడు అయ్యేటట్టుగా చూశాడు. ఈ సన్నివేశాల్లో వ్యాసుడినుంచి వ్యక్తం అయిన సమదృష్టీ, క్రమబుద్ధీ, పరమప్రేమా నిరంతరం స్మరించతగ్గవి.

దైవాన్ని కావాలని కోరి కొడుకుగా శుకుణ్ణి పొందాడు వ్యాసుడు. ఆ పుత్రుడిపైన లీలగా కొంత మమకారాన్నికూడా రుచి చూశాడు. కొడుకు తనకు మోక్షమార్గం ఉపదేశించమన్నప్పుడు జనకుడిదగ్గర కావలసిన సమన్వయాన్ని శుకుడు పొందగలడని దర్శించి జనకుడి పరిపూర్ణత్వాన్ని నోరారా శ్లాఘించి, వినయంగా వెళ్ళి రమ్మని తనబిడ్డను సాగనంపాడు వ్యాసుడు.

తన గురుపుత్రుడు తన చెంతకు నడిచివాచ్చాడని మురిసిపోయిన జనకుడు అతడి దర్శనమే తనకు చాలును అనుకొంటాడు. అతడిలో దివ్యత్వాన్ని దర్శిస్తూనే అతడు అడిగిన విషయాలన్నీ ఉపదేశిస్తాడు.

ఈ సన్నివేశాల్లో వ్యాసుడూ, శుకుడూ, జనకుడూ, ప్రవర్తించిన తీరులో, యోగస్థితిలో ఉన్నవారి సమదర్శనం ఎలా ఉంటుందో బోధపడుతుంది.

కృష్ణుణ్ణి మానవమాత్రుడిగా కాక, పరిపూర్ణ అవతార పురుషుడిగా దర్శించిన కొద్దిమందిలో వ్యాసుడు మొదటివాడు. కృష్ణుడికి ధర్మసంస్థాపన కార్యక్రమంలో కుడిభుజంగా పనిచేయడమే కాక, అతడిజీవితంలో యోగజీవితంయొక్క సమగ్రస్వరూపాన్నీ, అతడి బోధలో సకలవేదవాఙ్మయం యొక్క సమన్వయాన్నీ దర్శించడమే కాక హృదయంతో స్వీకరించి వాక్కుద్వారా వెలువరించి శిష్యులతో గ్రంథస్థం చేయించి భావితరాలవారికి నమర్పించిన బాధ్యతాయుతమూర్తి భగవానుడైన వ్యాసుడు.

ఒక రకంగా మహాభారతం అతడి ఇంటిగాథ, అతడి స్వీయచరిత్ర, ధృతరాష్ట్ర పాండురాజాదులు అతడి బిడ్డలు. కౌరవులూ, పాండవులూ అతడి మనుమలు. వారి గాథకు అక్షరరూపమేగదా! తనగాథకు తాను అంటుకోకుండా ఆగాథలో తనకు గల పాత్రను బాధ్యతతో పరిపూర్ణంగా నిర్వహిస్తూ ఆ గాథలో ప్రతిబింబిస్తున్న సృష్టిధర్మాల లీలలను దర్శిస్తూ వాటి సమగ్రస్వరూపాన్ని గ్రంథస్థం చేశాడు ఆయన. మానవుల్లో ఎవరికివారు తమజీవితగాథను ఒక ఇతిహాసంగా దర్శించి వర్తించగలగాలని తన ఆచరణద్వారా సూచిస్తున్నాడు వ్యాసుడు.

## ఆచార్యదేవోభవ

శ్రీ ఓడికంటి శ్రీనివాసమూర్తి

గురువులు శాంతమూర్తులు, నిగూఢత గల్గిన సాధుపుంగవుల్
పరువుగ జీవితమ్ము గడుపందగు నట్టి నపారప్రజ్ఞులున్
గురుతర బాధ్యతల్ దెలిపి కోరెద రెల్లరి యోగక్షేమముల్
ధరణి ననేక శిష్యులను దక్షుల జేసెడు ప్రాజ్ఞు లిమ్మహిన్ !

స్థిరముల్ గావిల రూపురేఖలు సిరుల్ శృంగారమౌహర్మ్యముల్
స్థిరముల్ గావిక భోగముల్ పదవులున్ చిందాడ వ్యర్థంబు, సు
స్థిరమైనట్టి పరోపకారగుణమున్ శీలమ్ము దాతృత్వముల్
స్థిరమై బ్రోచును త్యాగమెల్లపుడు వాంఛింపంగ సత్కర్మలా !

శిలలను జెక్కి నెమ్మదిగ శిల్పము జేరెడు శిల్పిరీతిగా
విలువలు గల్గ శిష్యులకు విద్యను నేర్పుచు నాత్మకింపుగా
సులువుగ తీర్చిదిద్ద నిలసోయగమై కనిపించుచుండ, లో
దలచెదరెల్ల ఛాత్రులు, సుధారస భాషణ లింపు దోచగన్!

పూచిన మల్లెచెట్టు తన పువ్వుల వాసన లెల్లదిక్కులన్
వీచినయట్లు, నొజ్జలిల విద్యలుబంచగ శిష్యజాలముల్
తోచిన రీతి సన్మనముతో తలవంచి నమస్కరింప, చే
జాచని గౌరవమ్మది విశాల మనస్కుల స్వర్ణహారమౌ!

ఎదురైనన్గని యాపి వాహనముపై నెక్కించుకోగా జనుల్
పద రమ్మంచును వెంటదోడ్కొనియు సంభావించు విద్యార్థుల
న్మదిలో గాంచ ననంతతృప్తిబొరల న్మర్యాద లూహించుచో
కొదవేమింకను చాలు సద్గురువుకున్ కొండంత యానందమౌ!

మేలొనగూర్చి వారికిని, మేలగు భాషణ సేయు వారికిన్
స్త్రీలను గౌరవింపదగు శీలము గల్గిన వారికిన్ సదా
బాలుర కెల్ల విద్యలను బంచిన వారికి సజ్జనాళికిన్
శ్రీలు కలుంగజేయు నిల శ్రీకరముల్ నిడు శ్రీనివాసుడున్!

# విశాఖ లలితాపీఠంలో ఆరాధనోత్సవాలు - ఒక నివేదిక

శ్రీ టి.పి.విజయాచారి, విశాఖ

శ్రీ లలితాపీఠంలో శ్రీశ్రీశ్రీ దక్షిణామూర్తిపరమహంస మరియు అవ్యాక్తానంద మహారాజ్ ఆరాధనోత్సవములు 23.06.08 నుండి 25.8.08 వరకు నిర్వహింపబడినవి.

**23.06.08** : సోమవారం ఉదయం సద్గురు శ్రీశ్రీ దక్షక్షిణామూర్తివరమహంస ఆరాధన, లలితాహోమము, గురుపూజ జరిగినవి. సాయంత్రం ముందుగా చి॥కె.పి.యస్. శాండిల్యచే అన్నమాచార్యకీర్తనలు, భక్తికీర్తనలు ఆలపింప బడినవి.

సాయంత్రం శ్రీ అవధాని రాంభట్ల పార్వతీశ్వరశర్మ అవధానమును శ్రీ పేరి రవికుమార్ నమర్ధవంతంగా నిర్వహించారు. శ్రీ ఓరుగంటి రాజరాజేశ్వరి ప్రసాదు సమస్యను, శ్రీమతి ఆర్.విజయలక్ష్మి దత్తపదిని, శ్రీ మంగుశివరామప్రసాద్ వర్ణనను, శ్రీ ఎమ్.టి.ఎస్.రాజు నిషిద్ధాక్షరిని, శ్రీ టి.పి.యన్. ఆచార్యులు న్యస్తాక్షరిని, శ్రీ విస్సారామచంద్రరావు గంటనాదము, డాక్టర్ డి.వి.నూర్యారావు గారు అప్రస్తుత ప్రసంగమును, శ్రీ గంటి సుబ్రహ్మణ్యం ఆశువును నిర్వహించారు. ఉత్సాహ, ఉత్కంఠ భరితంగా, రసవత్తరంగ అవధానం ముగిసింది. మేనేజరు వాడరేవు నుబ్బారావు గారు తొలిపలుకులలో తాము శ్రీశ్రీశ్రీ స్వామివారు పూర్వాశ్రమమున (14) పదునాలుగేండ్ల ప్రాయము నుండి అత్యంత సామర్థ్యముతో గావించిన అవధానముల నెన్నింటినో గాంచిన యనుభవము తమకు గలదని తెల్పి చిరంజీవి రాంభట్ల పార్వతీశ్వరశర్మను (అవధానిని) భవష్యత్తులో గొప్ప అవధాని కావలెనని ఆకాంక్షించిరి. అవధానిని అవధానము నందు పాల్గొనిన కవులందరని లలితాపీఠము తరఫున సన్మానము గావించిరి.

2406.08 మంగళవారము ఉదయం 10 గంటలకు శ్రీ గురుఇపూజ శ్రీ ప్రత్యంగిరా హోమము, విశేషపూజలు జరిగినవి. సాయంత్రం ముందుగా డాక్టర్ ఎం.నూర్య కుమారిగారి లఘు వ్యాఖ్యానముతో "అన్నమాచార్య సంకీర్తనము" ఆలపింపబడినది. తదనంతరం "మహిళాకవితా గోష్ఠి" ఆచార్య శ్రీమతి ఎన్.రాజేశ్వరీ శంకరంగారి అధ్యక్షతన 20 మంది కవయిత్రులు పాల్గొన్నారు. డాక్టర్ లలితాకుమారి, చర్ల మృదుల, చక్కా రమాదేవి, జి.వి.రమణమ్మ, స్వరాజ్యం, పుట్టు గ్రుడ్డియైన లక్ష్మీనారాయణమ్మ, డాక్టర్ ఎం.సూర్యకుమారి, జి.గాయత్రి, ఆదూరి సత్యవతి, డాక్టర్ కళ్యాణి, కుసుమా చక్రవర్తి, భవానీ శాంకరి, శ్రీ ఎ.టి.యస్. రాజు అధ్యక్షురాలు ఆచార్య శ్రీమతి రాజేశ్వరీ శంకరం రచయిత్రుల కవితలకు స్పందిస్తూ లఘువ్యాఖ్యాన మొనర్చారు. శ్రీమతి నుందరి, శ్రీమతి మధురవాణి, శ్రీమతి భవానీశాంకరి సంచాలకుల కోరిక మేరకు లలితాపీఠము తరఫున మహిళాకవితా గోష్ఠియందు పాలు వంచుకొనిన రచయిత్రులను కవయిత్రులను అమ్మవారి శేషవస్త్రాలతో సమ్మానించారు. శ్రీ టి.పి.యస్.ఆచార్యులు, ఉపసంచాలకులు పర్యవేక్షిస్తూ ఇతోధిక సహాయ సహకారా లందించారు.

25.6.08 శ్రీ అవ్యక్తానందమహారాజ్ గురు ఆరాధనోత్సవం సందర్భంగా ఉదయం గురుపూజ కాలభైరవ హోమం మిక్కిలి శ్రద్ధాభక్తులతో నిర్వహించారు. సాయంత్రం కుమారి జొన్నలగడ్డ పద్మావతి గారి "భక్తిగాన సుధ' భక్తుల హృదయాలను రంజింప జేసింది. తదనంతరం ఆంధ్రసారస్వత వైజయంతి - సాహిత్యరూపకం నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతిగా ఆచార్య శ్రీమతి కోలవెన్ను మలయవాసిని, ఆదికవి నన్నయగా, డా.ఎ.గోపాలరావు, కవిసార్వభౌముడు శ్రీనాధునిగా, సహజకవి పోతనగా శ్రీపేరి వెంకటరామకృష్ణ కాసుల పురుషోత్తమకవిగా డాక్టర్ పేరాల బాలమురళీకృష్ణ, తెనాలిరామకృష్ణునిగా శ్రీరాంభట్ల నరసింహశర్మ కవిసమ్రాట్ విశ్వనాధ సత్యన్నారాయణగా, శ్రీ పేరి రవికుమార్ తమ పాత్రలను సమర్థవంతంగా నిర్వహించారు. లలితాపీఠం పక్షాన కవులను ఘనంగా సత్కరించారు. సభ అద్యంతం ఆసక్తికరంగా శ్రోతలను ఆనందంలో ముంచింది. తొలత పాత్రల పాత్రధారుల ప్రతిభా పాటవాలను వర్ణిస్తూ శ్రీ వాడరేవు సుబ్బారావు వేదికమీదకి కవుల నాహ్వానించారు. శ్రీ విస్సారామచంద్రరావు గారు వందన సమర్పణ చేశారు.



విశాఖ లలితాపీఠంలో సాహితీ రూపకంలో పాల్గొన్న కవులు




విశాఖ లలితాపీఠంలో అష్టావధానంలో పాల్గొన్న కవులు

## అమెరికాలో స్వామి వారి కార్యక్రమ దృశ్యాలు







### కాశీలో శ్రీస్వామివారి చాతుర్మాస్య దీక్ష

శ్రీ స్వామివారు ఈసారి తమ చాతుర్మాస్యదీక్షను

**18.7.2008 నుండి 13.11.2008** వరకు కాశీలో నిర్వహించటానికి సంకల్పించారు.

వివరములకు ఈ క్రింది ఫోనును సంప్రదించగలరు.

పి.నాగేంద్రరాయ్, వ్యక్తిగత కార్యదర్శి. ఫోన్ : 9440208103, 9486285510

Postal Reg No. AP/VJ/GTR/55/2004
Registrar of NewsPapers No. AP/TEL/2002/9256

## స్వయంసిద్ధకాళీపీఠము - గుంటూరు

## శ్రీనాథ పీఠము - గుంటూరు

స్వామి అమెరికా పర్యటనవిశేషాలు, గ్రంథావిష్కరణసభ

### ఆహ్వానము

స్థలము : **స్వయంసిద్ధకాళీపీఠము**, 4వలైను, రవీంద్రనగర్, గుంటూరు -6

సమయము : **12.07.20 శనివారం సాయంత్రం 6 గంటలకు**

గ్రంథము : **బ్రహ్మర్షి దే హబాబా (బృందావనయోగి)**

రచయిత : **డాక్టర్ ప్రేమ ూర్ భార్గవ** (హిందీశాఖాధిపతి, హిందూకాలేజి)

గ్రంథసమీక్ష : **డాక్టర్ డి.యన్.దీక్షిత్ సంస్కృతశాఖాధిపతి, హిందూకాలేజి)**

గ్రంథ ప్రచురణ : **డాక్టర్ జె. జయప్రకాష్** రామకృష్ణ

గ్రంథావిష్కరణ అనుగ్రహభాషణ: **శ్రీసిద్ధేశ్వరానందభారతీమహాస్వా**






**సహృదయులందరికీ స్వాగత**

*From :*

If undelivered please return to
**MOUNA PRABHA**
B1-C40, 4th Line
Ravindra Nagar,
New Pattabhipuram,
GUNTUR - 522 006

BOOK-POST
AIR MAIL

To,

Sri/Smt ..............................

..............................

..............................

..............................

PIN : ..............................

Printed & Published by **Sri K.Syam Sundar,** ☎ 2231625
On behalf of Siddheswari Peetham, B1-C40, Ravindra Nagar, Guntur - 522 006.
Printed at Lakshmi Ganapathi Arts Printers, **GUNTUR - 2.**
**Editor : Dr. Premakumar Bhargava** ☎ 2239237